
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

కర్నూలు జిల్లా వార్తలు

5

శనివారం 19 జూలై 2025

ఎమ్మిగనూరు హౌసింగ్ ఏఈకి షోకాజ్ నోటీసులు

సంక్షేమ కార్యక్రమాలపై కలెక్టర్ సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నిర్దేశించిన లక్ష్యం మేరకు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయని ఎమ్మిగనూరు హౌసింగ్ ఏఈకి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా హౌసింగ్ పీడీని ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర, పీ-4 పాలసీ, తల్లికి వందనం, హౌసింగ్, ఉపాధి హామీ అమలు అంశాలపై స్పెషల్ ఆఫీసర్లు, డివిజన్ మండల స్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆదోని డివిజన్‌లో 1,796, పత్తికొండ డివిజన్‌లో 1,241, కర్నూలు డివిజన్‌లో 705 ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాల్సిందని ఆయా డివిజన్ల ఆర్డీవోలు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆప్షన్ త్రీ కింద ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయని కాంట్రాక్టర్లకు నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. తల్లికి వందనంకు సంబంధించి వచ్చిన గ్రీవెన్స్‌లో భూమి ఎక్కువగా ఉందని, లేని ఆస్తులు రావడం, కరెంటు బిల్లులు ఎక్కువగా ఉందని, ఇన్‌కం ట్యాక్స్ తదితర ఫిర్యాదులు వచ్చాయనీ, ప్రత్యేక శ్రద్ధ వహించి అర్జీలను పరిష్కరించాలని ఆదేశించారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న నీటి కుంటల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఉపాధి అధికారులను ఆదేశించారు. శానిటేషన్ అంశంలో కోసిగి మండలం దొడ్డి గ్రామంలో ఐవీఆర్‌ఎస్ ద్వారా నెగిటివ్ ఫీడ్ బ్యాక్ వచ్చిందని, అందుకు సంబంధించిన యాక్షన్ టేకెన్ నివేదికను ఇవ్వడంతో పాటు సంబంధిత పంచాయతీ సెక్రటరీపై చర్యలు తీసుకోవాలని డీపీవోను ఆదేశించారు. చిప్పగిరి మండలం బెల్డోన గ్రామంలో కూడా నెగిటివ్ ఫీడ్ బ్యాక్ వచ్చిందని అక్కడకు వెళ్లి విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను ఆదేశించారు. జూలై 21 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు బంగారు కుటుంబాలుగా గుర్తించిన వారి అవసరాలపై సర్వే నిర్వహించాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, సీపీవో హిమప్రభాకర్‌రాజు, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, హౌసింగ్ పీడీ చిరంజీవి, డ్వామా పీడీ వెంకటరమణయ్య, డీఈవో శామ్యూల్ పాల్ పాల్గొన్నారు.

జిల్లాలో 2.34 లక్షల హెక్టార్లలో సాగు

కర్నూలు అగ్రికల్చర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వివిధ పంటల సాగు విస్తీర్ణం ఆశాజనకంగా ఉందని వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి తెలిపారు. రాష్ట్రంలోనే అత్యధికంగా జిల్లాలో సాగవుతున్న పత్తి ప్రస్తుత ఖరీఫ్‌లో 2.34 లక్షల హెక్టార్లలో సాగవుతుందని అంచనా వేశామని, ఇప్పటికే 1.63 లక్షల హెక్టార్లలో సాగైందని.. ఈ నెలాఖరుకు ఆశించిన విస్తీర్ణంలో పత్తి సాగు కాగలదని జేడీ వరలక్ష్మి తెలిపారు. వేరుశనగ 54,710 హెక్టార్లలో సాగు కావాల్సి ఉండగా.. ఇప్పటికే 17,904 హెక్టార్లలో సాగైందని తెలిపారు. కందులు 33,296 హెక్టార్లకు గానూ, ఇప్పటికీ 20,238 హెక్టార్లలో సాగైంది. సద్ద 3,939 హెక్టార్లకు గానూ 3,403.4 హెక్టార్లలో, అదేవిధంగా మొక్కజొన్న 5,101 హెక్టార్లకు గానూ 2,028 హెక్టార్లలో సాగైంది. జొన్న 313 హెక్టార్లకు గానూ 98 హెక్టార్లు, వరి 12,919 హెక్టార్లకు గానూ 118 హెక్టార్లలో అదేవిధంగా కొర్ర 2,679 హెక్టార్లకు గానూ 737 హెక్టార్లలో సాగైంది. మినుములు 203 హెక్టార్లకు గానూ ఐదు హెక్టార్లు, పొద్దు తిరుగుడు 826 హెక్టార్లకు గానూ 46 హెక్టార్లు, ఆముదం 8,951 హెక్టార్లకు గానూ 5,799 హెక్టార్లు సాగైనట్లు జేడీ వరలక్ష్మి తెలిపారు. రైతులు మోతాదుకు మించి ఎరువులు వినియోగించకుండా పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవాలని ఆమె సూచించారు.

హంద్రీనీవా విస్తరణకు గ్రీన్ సిగ్నల్

హంద్రీనీవా మెయిన్ కెనాల్ లైనింగ్ పనులు



- 6,300 క్యూసెక్కులకు విస్తరించేందుకు ఉత్తర్వులు
- వైసీపీ హయాంలో టెండర్లతో సరి
- ప్రస్తుతం 3,850 క్యూసెక్కుల పనులు పూర్తి
- కృష్ణా జలాలు విడుదల చేసిన సీఎం చంద్రబాబు
- నాటి పనులు కొనసాగించేలా ఉత్తర్వులు జారీ
- రూ.7,797.96 కోట్లతో మరో ఏడు ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్

కర్నూలు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువను 6,300 క్యూసెక్కుల విస్తరణకు వైసీపీ హయాంలో టెండర్లు పిలిచారు. తక్కువ సమయంలో ఎక్కువ కృష్ణా వరద జలాలు సీమ జిల్లాలకు మళ్లిస్తామంటూ మాయమాటలతో మభ్యపెట్టారు. అదిగో ఇదిగో అంటూ ఐదేళ్లు గంపెడు మట్టి తీయకుండానే రైతులను మాయ చేశారు. చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ విస్తరణ పనులకు మోక్షం వచ్చింది. 120 రోజుల్లో 3,850 క్యూసెక్కులకు విస్తరణ పనులు 90 శాతానికి పైగా పూర్తి చేసి రికార్డు నెలకొల్పారు. గురువారం సీఎం చంద్రబాబు జలహారతి ఇచ్చి హంద్రీనీవా కాలువకు కృష్ణా జలాలు విడుదల చేసిన నేపథ్యంలో ఇరిగేషన్ అధికారులు అడుగు ముందుకేశారు. గత ప్రభుత్వంలో టెండర్లతో ఆపేసిన 6,300 క్యూసెక్కుల సామర్థ్యానికి విస్తరణ పనులు కొనసాగించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తూ శుక్రవారం జలవనరుల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జి.సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే కాలువను విస్తరిస్తారా..? లైనింగ్ చేస్తారా..? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వీటితో పాటు ఉమ్మడి జిల్లాలో మరో రూ.7,797.96 కోట్లతో చేపట్టే మరో ఏడు ప్రాజెక్టులను కొనసాగించేందుకు జీవో ఎంఎస్ నంబరు.44 జారీ చేశారు. అసంపూర్తిగా వదిలేసిన పత్తికొండ (పందికోన) కుడి, ఎడమ కాలువలు, వేదవతి ప్రాజెక్టుపై దృష్టి సారించాలని ఇంజనీర్లకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.



నాటి టెండర్లు కొనసాగించేలా ఉత్తర్వులు

సీఎం చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ హంద్రీనీవా కాలువ విస్తరణ పనులపై దృష్టి పెట్టింది. మల్యాల వద్ద 0/0 నుంచి 400.50 కి.మీలు కుప్పం వరకు ప్రధాన కాలువ విస్తరణ, కుప్పం, పుంగనూరు బ్రాంచి కెనాల్స్ లైనింగ్‌కు రూ.1,970 కోట్లతో శ్రీకారం చుట్టారు. 120 రోజుల్లో 1.75 కోట్లు క్యూబిక్ మీటర్లు మట్టి పనులు, 45 లక్షల స్క్వేయర్ మీటర్లు సీసీ లైనింగ్, షాట్‌క్రెటింగ్ పనులు పూర్తి చేసి ఇంజనీరింగ్ చరిత్రలో రికార్డు నెలకొల్పారు. అయితే సీమ జిల్లాల్లో 60 టీఎంసీల నీటి అవసరాలు ఉండడంతో, గత ప్రభుత్వం హయాంలో 6,300 క్యూసెక్కుల ప్రవాహానికి వీలుగా టెండర్లు పూర్తి చేసిన విస్తరణ పనులు కొనసాగించేందుకు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

మిగతా 6వ పేజీలో

హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం ప్రధాన లక్ష్యం శ్రీశైలం ఎగువన 40 టీఎంసీలు ఎత్తిపోసి ఉమ్మడి కర్నూలు, అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాల్లో 6.05 లక్షల ఎకరాలకు సాగు, 35 లక్షల జనాభాకు తాగునీరు ఇవ్వాలన్నది పాలకుల లక్ష్యం. తొలి దశ (ఫేజ్-1)లో మల్యాల నుంచి అనంతపురం జిల్లా జీడిపల్లి జలాశయం వరకు 216.30 కి.మీలు ప్రధాన కాలువ, 8 ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. హైడ్రాలికల్ గణాంకాల ప్రకారం 3,850 క్యూసెక్కులు ప్రవాహానికి వీలుగా మెయిన్ కెనాల్ బెడ్ విడ్త్ (కాలువ అడుగు భాగం వెడల్పు) 9.5 మీటర్లు నిర్మించారు. లైనింగ్ చేస్తే 12 పంపుల ద్వారా 3,850 క్యూసెక్కులు (ఒక్కో పంపు 330 క్యూసెక్కులు) లిఫ్ట్ చేసేలా డిజైన్ చేస్తే, 5-6 పంపుల ద్వారా 1,940 క్యూసెక్కులకు మించి ఎత్తిపోసుకోలేని పరిస్థితి ఉంది. గత టీడీపీ ప్రభుత్వంలో 3,850 క్యూసెక్కుల ప్రవాహానికి రూ.1,030 కోట్లతో విస్తరణ పనులు చేపట్టింది. ఆ తరువాత వైసీపీ ప్రభుత్వం పనులు ఆపేసింది. 6,300 క్యూసెక్కులకు విస్తరిస్తాం..! అంటూ ఆర్భాటం చేసి రూ.6,182.19 కోట్లతో టెండర్లు పిలిచారు. గంపెడు మట్టి కూడా తీయకుండానే ఐదేళ్లు గడిచిపోయాయి. పైగా అసంపూర్తిగా ఉన్న పత్తికొండ (పందికోన) రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువలు, పంట కాలువలు పూర్తి చేస్తే 65 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని ఇంజనీర్లు ప్రతిపాదనలు పంపినా పైసా ఇవ్వలేదు.



పత్తికొండ (పందికోన) జలాశయం

అన్నదాతలకు ఊరట



కర్నూలు అగ్రికల్చర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు కురిసిన వర్షాల వల్ల రైతులకు ఊరటకలిగింది. ఎండుతున్న పైర్లకు ఈ వర్షాలు ప్రాణం పోసినట్లయిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పత్తికొండలో అత్యధికంగా 56 మిల్లీమీటర్ల మేర వర్షం నమోదైంది. తుగ్గలిలో 24.2 మి.మీ., కల్లూరులో 14.2, కర్నూలు అర్బన్‌లో 13.6, కర్నూలు రూరల్‌లో 12.2, ఓర్వకల్లు మండలంలో 12.2, దేవనకొండలో 12.2, సి.బెళగల్‌లో 4.8, వెల్దుర్తిలో 3.2, క్రిష్ణగిరిలో 2.2, గూడూరులో 1.4 మి.మీ., మేర వర్షపాతం నమోదైంది. జూలైలో సాధారణ వర్షపాతం 52.7 మి.మీ., కాగా, ఇప్పటికీ 47 మి.మీల వర్షం నమోదైందని జేడీ వరలక్ష్మి తెలిపారు.

లిఫ్ట్ ఇరిగేషన్‌కు రూ.74లక్షల నిధులు

టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



కర్నూలు అర్బన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మంత్రాలయం నియోజక వర్గంలోని గురురాఘవేంద్ర పరిధిలో లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు సీఎం రూ.74లక్షల నిధులు మంజూరు చేశారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడికి కృతజ్ఞతలు తెలిపారు. మూగలదొడ్డి లిఫ్ట్ ఇరిగేషన్, కోసిగి మండలం శాతనూరుకు రూ.9లక్షలు, సోగనూర్ లిఫ్ట్, చిన్న కొత్తపల్లికి రూ.19.95 లక్షలు, దుద్ది లిఫ్ ఇరిగేషన్ మాధవవరానికి రూ.19.90 లక్షలు, దాదాపు 20 లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంలకు నిధులు మంజూరు చేశారు. ఈ ప్రాంత రైతులకు కూటమి ప్రభుత్వం న్యాయం చేసిందని ఆయన తెలిపారు.

టీడీపీ హయాంలోనే 'సీమ'కు సాగునీరు

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి
- 'గాలేరు-నగరి'కి ఐదువేల క్యూసెక్కుల నీటి విడుదల



బనకచెర్ల క్రాస్ హెడ్ రెగ్యులేటర్ వద్ద బటన్ నొక్కి నీటిని విడుదల చేస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు

పాములపాడు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాయలసీమకు సాగునీరు అందించిన ఘనత టీడీపీదేనని రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని బనకచెర్ల క్రాస్ హెడ్ రెగ్యులేటర్ వద్ద నందికొట్కూరు, శ్రీశైలం ఎమ్మెల్యేలు జయసూర్య, బుడ్డా రాజశేఖరరెడ్డితో కలసి ప్రత్యేక పూజలు నిర్వహించి బటన్ నొక్కి 'గాలేరు-నగరి'కి ఐదువేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. గంగమ్మకు పసుపు, కుంకుమ, చీర, పూలు సారె సమర్పించి జలహారతి నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ మాట్లాడుతూ రాయలసీమలో తెలుగుగంగను ఏర్పాటుచేసి వేల ఎకరాల బంజరు భూములను సాగులోకి తీసుకొచ్చి రైతుల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకొన్న మహనీయుడు తెలుగుదేశం వ్యవస్థాపకుడు ఎన్‌టీ రామారావు అన్నారు. పోతిరెడ్డిపాడు నుంచి 25 వేల క్యూసెక్కులు నీరు విడుదల చేస్తుండటంతో వాటిని వీబీఆర్‌కు 20వేలు, జీఎన్‌ఎస్‌ఎస్‌కు 5 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. గోరుకల్లు రిజర్వాయరు నీటి సామర్థ్యం 5టీఎంసీలు ఉండేదని, 2014-2019 టీడీపీ హయాంలో కోట్ల రూపాయలు వెచ్చించి 13 టీఎంసీలకు పెంచి ఆ ప్రాంత రైతులకు సాగు, తాగునీటిని అందించిన ఘనత ఒక్క టీడీపీకే దక్కిందన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రాజెక్టుల గేట్లకు కనీసం గ్రీస్‌కు కూడా పెట్టలేదని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.22కోట్లు మరమ్మతులకు కేటాయించిందన్నారు. కడప, చిత్తూరు, పులివెందుల, గండికోటతో పాటు ఇతర ప్రాంతాలకు తెలుగు గంగ ద్వారా కొన్నివేల ఎకరాలకు బనకచెర్ల క్రాస్ హెడ్ రెగ్యులేటర్ నుంచి నీటిని విడుదల చేస్తామన్నారు.

రుణజాలం

- ఫోర్జరీ డాక్యుమెంట్లతో బ్యాంకులో రూ.3.24 కోట్ల రుణం
- కంతుల కట్టకుండా ముఖం చాటేసిన మోసగాళ్లు
- ముందస్తు బెయిల్‌ను తిరస్కరించిన హైకోర్టు
- 100 రోజులైనా అరెస్టు చేయని పోలీసులు
- నిందితులను కాపాడుతున్న అదృశ్య శక్తులు?
- రాజకీయ పలుకుబడే కారణమా?



మోసగాళ్లు అల్లిన రుణజాలానికి బ్యాంకు అధికారులు పడ్డారు. సామాన్యుడికి రుణాలిచ్చేందుకు సవాలక్ష ప్రశ్నలు, డాక్యుమెంట్లు అధికారులు అడుగుతారు. అదే కేటుగాళ్లు ఫోర్జరీ చేసిన డాక్యుమెంట్లకు మాత్రం రూ.కోట్లు కట్టబెట్టారు. రుణం పొందిన వారు నెలవారి కంతులు చెల్లించకుండా ముఖం చాటేస్తుండటంతో అనుమానాలకు తావిచ్చింది. నోటీసులు పంపినా రుణగ్రహీతలు కనీసం స్పందించకపోవడంతో తనఖా పెట్టిన భూ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. మోసపోయామని తెలుసుకున్న బ్యాంకు అధికారులు చర్యలకు ఉపక్రమించగా వారిని అరెస్టు చేయకుండా పోలీసులు తీవ్ర జాప్యం చేస్తున్నారు. నిందితులను అరెస్టు చేయకుండా కాపాడుతున్న ఆ అదృశ్య శక్తులు ఎవరన్నది ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు నిందితులకు అధికార, ప్రతిపక్ష నాయకులతో మంచి సంబంధాలు ఉండడంతోనే జాప్యం జరుగుతున్నట్లు తెలిసింది. పోలీసులపై ఒత్తిడి తెచ్చి అరెస్టు చేయకుండా తిరుగుతున్నట్లు సమాచారం. దీనిపై జిల్లా పోలీసులు ఉన్నతాధికారులే తేల్చాల్సి ఉంది.



ఆదోని, జూలై 18(ఆంధ్రజ్యోతి): మోసగాళ్ల రుణజాలానికి చిక్కిన బ్యాంకు అధికారులు ఎట్టకేలకు మేల్కొని నిందితులపై చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆశ్రయించారు. వారు మాత్రం జాప్యం చేస్తున్నారు. పట్టణంలోని మహాయోగి లక్ష్మమ్మ కోఆపరేటివ్ బ్యాంకులో పారిశ్రామికవేత్త కుటుంబం ఎల్లె మల్లేశప్ప, ఎల్లె చెన్నబసవ, ఎల్లె చైత్ర అనే వారు పొలం తనఖాపెట్టి 2021 డిసెంబరు 8వ తేదీన రుణాన్ని పొందారు. సర్వేనంబర్ 24లో 4.5 ఎకరాలను వైఎంకే టీచర్స్ బిల్డింగ్ సొసైటీకి 1982లో అనంతపురం జిల్లా ఉరవకొండ గవి మఠం వారు రూ.90 వేలకు విక్రయించారు.



మిగతా 7వ పేజీలో

అనాలోచిత విధానాలతో ఆర్థిక వ్యవస్థ నాశనం

- మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ

7

ప్రాణం తీసిన సరదా

- ప్రైవేట్ భాగాలపై తన్నడంతో వ్యక్తి మృతి
- స్నేహితుడిపై హత్య కేసు నమోదు

శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు షోకాజ్ నోటీసులు

కర్నూలు న్యూసిటీ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలో పారిశుధ్య విభాగానికి సంబంధించిన విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఐదుగురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఐదుగురు శానిటరీ సెక్రటరీలకు షోకాజ్ నోటీసులు ఇస్తూ కమిషనర్ పి.విశ్వనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు. విధుల్లో, ట్రేడ్ లైసెన్సు ఫీజుల వసూళ్లలో నిర్లక్ష్యం చేయడంతో షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ క్రమంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్ పారిశుధ్య విభాగంపై ప్రాధాన్యత చేపట్టినట్లు తెలుస్తోంది.

ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

- ఆరునెలలైనా అమలుకాని మంత్రి హామీ
- ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు
- డీఎస్సీ 2003 ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో ఆందోళన



ధర్నా చౌక్ వద్ద మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని, లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు హెచ్చరించారు. ఏపీ డీఎస్సీ 2003 ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీకృష్ణదేవరాయల సర్కిల్ ధర్నా చౌక్ వద్ద ఉపాధ్యాయులు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. ఉపాధ్యాయులకు పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీ కృష్ణారెడ్డి, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకట్రాముడు, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోకారి, ప్యాప్టో సేవాలాల్ నాయక్, బీటీఏ గౌరవాధ్యక్షుడు రామశేషయ్య, ఆపస్ సత్యనారాయణ, ఏపీటీఎఫ్ మాజీ జిల్లా అధ్యక్షుడు రంగన్న, పీఎన్‌యూఎస్ ప్రతినిధి బజారన్న సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా జి.హృదయరాజు మాట్లాడుతూ గత డిసెంబరు 13న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌తో చర్చించామని, ఈ చర్చల్లో భాగంగా కేంద్రం ఇచ్చే పెన్షన్ స్కీం కాబట్టి.. దీనిన్ని కచ్చితంగా అమలు చేస్తామనీ హామీ ఇచ్చారన్నారు. ఆరు నెలలు గడచినప్పటికీ ఇచ్చిన హామీలకు అతీగతీ లేదన్నారు. ఈ పాత పెన్షన్ స్కీం అమలైతే విద్యా, హోంశాఖలతో పాటు ఇతర శాఖల ఉద్యోగులను కలుపుకుని మొత్తం 11వేల మందికి లబ్ధి చేకూరుతుందన్నారు. దేశంలోని 16 రాష్ట్రాల్లో మెమో.57ను అమలుచేసి ఒక ఆంధ్రప్రదేశ్‌లోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు వర్తింపజేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. అనంతరం ధర్నా చౌక్ నుంచి మెడికల్ కళాశాల, ఆసుపత్రి మీదుగా కలెక్టరేట్ వరకు ఉపాధ్యాయులు ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఉపాధ్యాయుల ఫోరం నాయకులు ఎస్.వెంకటేశ్వర్లు, ఎస్.ముజహార్ హుశేన్, పి.సుకుమార్, ఎస్.బాలాజీరావు, ఎస్.పి.మంగళ లక్ష్మీ, జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.



హిమగిరిగా నల్లమల క్షేత్రం

మహానంది క్షేత్రం సమీపంలోని నల్లమల అడవి హిమగిరిగా మారింది. శుక్రవారం ఉదయం నల్లమలను దట్టంగా పొగమంచు కప్పేసింది. వృక్ష పర్వతాలు కాస్త హిమ పర్వతంగా మారి నూతన సోయగాలను సంతరించుకున్నాయి. వీటికి తోడు ఒక మోస్తరు వర్షం కురియడంతో పచ్చదనం పరిఢవిల్లుతోంది. తెల్లవారుతున్న దృశ్యంకు తోడు తెల్లటి మంచు దుప్పటి నల్లమల శోభను మరింత పెంచాయి. మహానంది ఆలయానికి దర్శనం కోసం వచ్చిన భక్తులకు, పర్యాటకులకు ఈసుందర దృశ్యం కనువిందు చేసింది.

● మహానంది ఆంధ్రజ్యోతి

వరుణదేవా.. కరుణించవయ్యా..!

వర్షం కోసం మోకాళ్లపై నడిచిన రైతు

వరుణ దేవుడు కరుణించి వర్షం కురువాలంటూ కొలిమిగుండ్లకు చెందిన రైతు గుడిపాటి శేఖర్ శుక్రవారం మోకాళ్లపై నడిచి అమ్మవారికి పూజలు నిర్వహించారు. బస్టాండు సమీపంలోని బొడ్రాయి వద్ద పూజలు చేశారు. అక్కడి నుంచి పెద్దమ్మ ఆలయం వరకు మోకాళ్లపై నడిచి వెళ్లి అమ్మవారికి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. వర్షాలు లేక పంటలు ఎండి పోతున్నాయని అమ్మవారు కరుణించి భారీ వర్షాలు కురువాలని మొక్కు చెల్లించినట్లు శేఖర్ తెలిపారు.

●కొలిమిగుండ్ల (ఆంధ్రజ్యోతి)



పెద్దమ్మ వద్దకు మోకాళ్లపై వెళుతున్న రైతు శేఖర్

8ఏళ్లలో 1,400 మందికి గుండె ఆపరేషన్లు

- కర్నూలు జీజీహెచ్‌కు అరుదైన గౌరవం
- సీటీవీఎస్ విభాగాధిపతి డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి



కేక్ కట్ చేస్తున్న డాక్టర్ ప్రభాకర్ రెడ్డి

కర్నూలు హాస్పిటల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జీజీహెచ్ కార్డియోథోరాసిక్ విభాగంలో 2017 నుంచి ఇప్పటి వరకు 1,400 మందికి గుండె శస్త్ర చికిత్సలను నిర్వహించినట్లు కార్డియో థోరాసిక్ విభాగపు హెచ్‌వోడీ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని సీటీవీఎస్ విభాగంలో ఆయన వైద్యులు, సిబ్బందితో కలసి కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ 2017లో అప్పటి డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి, వైద్యఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ కృషి ఫలితంగా రూ.7.5 కోట్లతో నూతనంగా సిటీవీఎస్ విభాగం ప్రారంభమైందన్నారు. 2017 సెప్టెంబరు 23న నందికొట్కూరుకు చెందిన సాజీదా బీ (22) మహిళకు మొట్టమొదటిసారిగా గుండె ఆపరేషన్ నిర్వహించామన్నారు. అప్పటి నుంచి బైపాస్ సర్జరీ, వాల్వ్ రిప్లేస్‌మెంటు, బీటింగ్ హార్ట్ సర్జరీ, చిన్న కోత ఆపరేషన్లు, చిన్నపిల్లలకు హార్ట్ ఆపరేషన్లు, ఊపిరితిత్తుల శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహించామన్నారు. సిటీవీఎస్ విభాగంలో రెండు మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లతో పాటు ఆరు పడకల ఐసీయూ, 20 సాధారణ పడకలు, హార్ట్ లంగ్ మిషన్ అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులకు దీటుగా ఈ విభాగాన్ని కొనసాగిస్తున్నామన్నారు. ఉచితంగా అందించే ఈ అవకాశాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అక్రమంగా ఇసుకను తరలిస్తే కేసులు



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని క్యాంపు కార్యాలయంలో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక రీచ్‌ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారని, ఇసుక రవాణాను పటిష్టంగా పర్యవేక్షించాలని రెవెన్యూ, పోలీసు అధికారులను ఆదేశించారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్నప్పటికీ వీఆర్వోలు సమాచారం ఇవ్వకుండా ఉన్నట్లయితే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటివరకు అక్రమ ఇసుక రవాణాకు సంబంధించి తీసుకున్న చర్యలపై నివేదికలు పంపాలని ఆదోని సబ్ కలెక్టర్, కర్నూలు, పత్తికొండ ఆర్డీవోలను ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్, ఆర్డీవో భరత్, మైనింగ్ అధికారి రవిచంద్, భూగర్భ జలాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కిషోర్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రహదారులపై సమీక్ష

రోడ్ల భూసేకరణకు సంబంధించి రైతులకు పరిహారం పంపిణీలో పెండింగ్ లేకుండా చూడాలని రవాణా, రోడ్లు భవనాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఆర్‌అండ్‌బీ, నేషనల్ హైవే రోడ్డు, ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, రవాణా, ఆర్టీసీ అంశాలపై ఆర్‌అండ్‌బీ నేషనల్‌హైవే, రెవెన్యూ, రవాణా, ఆర్టీసీ శాఖల అధికారులతో రవాణా రోడ్లు, భవనాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే సమీక్ష నిర్వహించారు.

రైతులకు గిట్టుబాటు ధరలు

- క్వింటా వేరుశనగ రూ.7,100
- ఉల్లికి రూ.1,295
- ఆనందంలో అన్నదాతలు



కర్నూలు అగ్రికల్చర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కొన్ని రోజులుగా పంటల ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు లేక రైతులు అల్లాడిపోయేవారు. ఈపరిస్థితుల్లో శుక్రవారం కర్నూలు మార్కెట్ యార్డులో వివిధ పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర అందింది. దీంతో రైతులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. వేరుశనగ కాయలకు గరిష్ఠ ధర రూ.7,100లు, మధ్యస్థ ధర రూ.7,000, కనిష్ఠ ధర రూ.2,079 దక్కిందని సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి, అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు తెలిపారు. వాముకు గరిష్ఠ ధర రూ.16,926లు, కనిష్ఠ ధర రూ.1,011 దక్కింది. కందులకు గరిష్ఠ ధర రూ.6,359, కనిష్ఠ ధర రూ.4,490 పలికింది. ఉల్లిగడ్డలకు గరిష్ఠ మధ్యస్థ, కనిష్ఠ ధరలు ఏకంగా రూ.1,295 దక్కడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. కొర్రలకు క్వింటానికి గరిష్ఠ ధర రూ.2,940, మధ్యస్థ ధర రూ.2,512లు, కనిష్ఠ ధర రూ.2,249 దక్కింది.

లైసెన్సులు రద్దు చేస్తాం

కర్నూలు మార్కెట్ యార్డులో పంట ఉత్పత్తులను అమ్మకానికి తీసుకువస్తే మంచి ధర లభిస్తుంది. కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులు రైతులకు గిట్టుబాటు ధర అందించాలి. తూకంలో తేడాలు, వివిధ రూపాల్లో రైతుల నుంచి వసూళ్లు చేయాల్సిన చార్జీలను నిబంధనల మేరకు కాకుండా అధిక మొత్తంలో వసూలు చేస్తే విచారణ జరిపి లైసెన్సులు రద్దు చేస్తాం.

- జయలక్ష్మి, సెలక్షన్‌గ్రేడ్ సెక్రటరీ, కర్నూలు మార్కెట్ యార్డు

హంద్రీనీవా విస్తరణకు గ్రీన్ సిగ్నల్

(5వ పేజీ తరువాయి)

నందికొట్కూరు మండలం మల్యాల పంపింగ్ స్టేషన్ అప్రోచ్ ఛానల్ 4.806 కిలోమీటర్లు, 0/00 నుంచి అనంతపురం జిల్లా జీడిపల్లి వరకు 216.300 కి.మీల వరకు ప్రధాన కాలువ విస్తరణ, 8 పంపింగ్ స్టేషన్ల దగ్గర అదనంగా 2,450 క్యూసెక్కులు ఎత్తిపోసేందుకు అదనపు పంపులు ఏర్పాటుకు రూ.6,182.19 కోట్ల మంజూరు చేస్తూ 2021 సెప్టెంబరు 15న అప్పటి వైసీపీ రాష్ట్ర ప్రభుత్వం సాంకేతిక అనుమతులు ఇచ్చింది.

● ప్యాకేజీ-1 కింద రూ.3,278.18 కోట్లతో చేపట్టిన అప్రోచ్ చానెల్ 4.806 కి.మీలు, 0/00 నుంచి 88.000 కి.మీల వరకు కాలువ విస్తరణ, పీఎస్ -1 నుంచి 5 వరకు పంపింగ్ స్టేషన్ల దగ్గర అదనపు పంపులు ఏర్పాటు పనులు రూ.2,484 కోట్లకు చేస్తామని హైదరాబాదుకు చెందిన మెగా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్షర్ లిమిటెడ్ కంపెనీ ఒప్పందం చేసుకుంది.

● ప్యాకేజీ-2 కింద రూ.2,904.01 కోట్లతో చేపట్టే 88.000 కి.మీల నుంచి 216.300 కి.మీల వరకు ప్రధాన కాలువ విస్తరణ, పీఎస్-6 నుంచి 8 (3 లిఫ్టులు) వద్ద అదనపు పంపులు ఏర్పాటు పనులు రూ.2,163.15 కోట్లకు చేస్తామని హైదరాబాదుకు చెందిన డీఎస్ఆర్ - వీపీఆర్ జాయింట్ వెంచర్‌గా పనులు దక్కించుకుని 2021 డిసెంబరు 31న ఒప్పందం చేసుకున్నారు. ఏమాత్రం పనులు చేపట్టలేదు.



దేవనకొండ మండలం కరివేముల వద్ద నిర్మాణానికి నోచుకొని పత్తికొండ జలాశయం కుడి కాలువ సింగిల్ లైన్ రోడ్డు బిడ్జి

కూటమి ప్రభుత్వం వచ్చాక వీటిని రద్దు చేసింది. అయితే రాయలసీమ జిల్లాల్లో సాగు, తాగునీటికి 60 టీఎంసీలకు పైగా అవసరాలు ఉండడంతో ఈ పనులు కొనసాగించేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

ఆ.. ప్రాజెక్టులపై ఫోకస్ పెట్టండి

ఉమ్మడి కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతానికి సాగునీరు అందించే వేదవతి ఎత్తిపోత పథకం ప్రాజెక్టును తక్షణం చేపట్టి ప్రతిష్టాత్మకంగా పూర్తి చేయాలి. అలాగే హంద్రీనీవా ప్రాజెక్టులో భాగంగా 75-80 శాతం పూర్తి చేసి పిల్ల కాలువలు అసంపూర్తిగా వదిలేసిన పత్తికొండ (పందికోన) జలాశయం కుడి, ఎడమ కాలువల డిస్ట్రిబ్యూటరీలు, పిల్ల కాలువలు పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు ఇంజనీర్లకు దిశానిర్దేశం చేశారు. గురువారం మల్యాల వద్ద ప్రత్యేక బస్సులో సీఈలు నాగరాజు, కబీర్‌బాషా, ఎస్ఈలు పాండురంగయ్య, బాలచంద్రారెడ్డి, ఈఈ ప్రసాద్‌రావు సహా పలువురు ఇంజనీర్లతో సమీక్షించారు. విస్తరణ పనులు శరవేగంగా పూర్తి చేసిన హంద్రీనీవా ప్రాజెక్టు సీఈ నాగరాజు, ఎస్ఈ పాండురంగయ్య సహా ఇంజనీర్లను అభినందించారు. అదే క్రమంలో ప్రథమ ప్రాధాన్యతగా పందికోన కుడి, ఎడమ కాలువలు, వేదవతి ప్రాజెక్టులు చేపట్టి పూర్తి చేయాలని లక్ష్యాలు నిర్దేశించారు.

కొనసాగింపు ఉత్తర్వులు జారీ చేసిన ప్రాజెక్టుల వివరాలు (రూ.కోట్లల్లో)

ప్రాజెక్టు	నిధులు	కాంట్రాక్ట్ సంస్థ
గోరుకల్లు (జీబీఆర్) వద్ద అదనపు రెగ్యులేటర్	36.90	ఆర్ఆర్ ఎడిపీసే ప్రైవేట్ లిమిటెడ్
శ్రీశైలం ప్రాజెక్టు 12 క్రస్ట్‌గేట్లు ప్రత్యేక మరమ్మతులు	1.59	ఎస్‌వీ ఇంజనీరింగ్ సంస్థ
శ్రీశైలం డ్యాం వద్ద 1,000 కేవీఏ విద్యుత్ ట్రాన్స్‌ఫారం	1.00	ఆర్. పాండురంగం అండ్ సన్స్ సంస
టీజీపీ సర్కిల్, ఎస్ఆర్‌బీసీ సర్కిల్ కార్యాలయ భవనాలు	5.25	కాంట్రాక్టర్ కానాల గోపాల్‌రెడ్డి
వేదవతి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు	1,942.80	మెఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్
ఆర్డీఎస్ కుడి కాలువ ప్రాజెక్టు	1,985.42	ఎన్‌సీసీ లిమిటెడ్ సంస్థ
రాయలసీమ ఎత్తిపోతల పథకం	3,825	ఎస్‌పీఎంఎల్-ఎన్‌సీసీ-మెఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్
మొత్తం	7,797.96	

గజ్జెహళ్లిలో తెల్లకాకి



గజ్జెహళ్లిలో తెల్లకాకి

హొళగుంద, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా కాకులు నలుపురంగులో ఉంటాయి. అయితే హొళగుంద మండలంలోని గజ్జెహళ్లి గ్రామంలో శుక్రవారం ఓ తెల్ల కాకి సంచరించింది. నల్లకాకుల సమూహంలో ఆ తెల్ల కాకి విభిన్నంగా ఉండటంతో ప్రజలు తెల్లకాకిని చూసేందుకు ఎగబడ్డారు. గజ్జెహళ్లిలోని బీసీ కాలనీలో వడ్లను తినేందుకు నల్లకాకులతో పాటు తెల్లకాకి కూడా వాలింది. ఈ విషయంపై వెటర్నరీ డాక్టర్ సోమశేఖర్ గౌడ్‌ను వివరణ కోరాగా జన్యుపర లోపం వల్ల ఇలా రంగు మారతాయని తెలిపారు.



గజ్జెహళ్లిలో నల్ల కాకులతో విహరిస్తున్న తెల్లకాకి

పురాతన భవన సామర్థ్య స్థితిపై పరీక్షలు



అమిర్‌మియా భవనాన్ని తనిఖీ చేస్తున్న బెంగళూరుకు చెందిన సంస్థ ప్రతినిధులు

కర్నూలు న్యూసిటీ, జూలై 18(ఆంధ్రజ్యోతి): నగరంలోని పాతబస్తీ చిదంబరావు వీధిలో శిథిలావస్థలో ఉన్న అమీర్‌మియా భవనాన్ని శుక్రవారం బెంగళూరుకు చెందిన బ్యూరో వెరిటాస్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ తనిఖీ చేసింది. పురాతన భవనం ప్రమాదమని భావించి నగర పాలక సంస్థ సదురు భవన సామర్థ్య స్థితిపై బ్యూరో వెరిటాస్ ద్వారా పరీక్షలు నిర్వహిస్తుంది. 2-3 రోజుల పాటు ఈసర్వే కొనసాగుతోంది. అనంతరనం బ్యూరో వెరిటాస్ నివేదిక ఆధారంగా నగర పాలక అధికారులు అవసరమైై చర్యలు తీసుకోనున్నారు. సంస్థ ప్రతినిధులు, పట్టణ ప్రణాళికా విభాగం సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ అంజాద్‌బాషా, సిబ్బంది ఉన్నారు.

ఆగస్టు 24న కడపలో బ్రాహ్మణ సమ్మేళనం

కర్నూలు కల్చరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): కడప నగరంలో ఆగస్టు 24వ తేదీన బ్రాహ్మణ సమ్మేళనంతోపాటు వివాహ పరిచయ వేదిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా బ్రాహ్మణ చైతన్య వేదిక అధ్యక్షుడు కేవీఎల్ఎన్ రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర నాయకులు వీవీఎస్‌వీ ప్రసాదరావు, సూగూరు రఘునాథరావుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సమ్మేళనంలో సమకాలీన సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని వివరించారు. బ్రాహ్మణ వివాహ వేదికకు పెళ్లి కాని పిల్లల వివరాలను వారి తల్లిదండ్రులు ఆగస్టు 20 లోగా 9948664728, 9985620758 వాట్సాప్ నెంబర్లకు పంపాలని, వివరాలకు ఫోన్లలో సంప్రదించాలని సూచించారు. వివాహ పరిచయ వేదికకు వచ్చేవారు ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు.

మహాబలేశ్వర ఆలయంలో పూజలు

కర్నూలు కల్చరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): స్థానిక నెహ్రూనగర్‌లోని పుట్టపర్తి సత్యసాయిబాబా మందిరంలోని మహాబలేశ్వర ఆలయం (శివాలయం)లో స్వామి, అమ్మ వార్లకు శాకంబరిగా అలకరించి పూజలు చేశారు. ఆషాఢ మాసంలోని శుక్రవారం సందర్భంగా స్వామి, అమ్మవార్ల అనుగ్రహాన్ని ఆకాంక్షిస్తూ ఈ పూజలు చేపట్టారు. అంతకు ముందు భగవాన్ సత్యసాయి బాబా వారికి సంకీర్తనలు, పూజార్చనలు నిర్వహించారు. అనంతరం మహిళలు అమ్మవారికి సామూహికంగా కుంకుమార్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల జిల్లా కన్వీనర్ మాకా అశోక్‌కుమార్, సాయికృష్ణారెడ్డి, సాయిబాబా పాల్గొన్నారు.



శాకంబరి అలంకరణలో మహాబలేశ్వర స్వామివారు

హరితహారం

- జిల్లావ్యాప్తంగా 4.86 లక్షల మొక్కలు సిద్ధం
- పంపిణీకి నిర్దిష్ట ప్రణాళికలు
- ఇప్పటికే 1.51 లక్షల మొక్కల పంపిణీ పూర్తి



పంపిణీకి సిద్ధం చేసిన మొక్కలు

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పుడమి తల్లిని హరితహారంగా మార్చేందుకు అటవీ శాఖాధికారులు సన్నద్ధమయ్యారు. మొక్కల పెంపకం, పంపకాన్ని మొక్కుబడిగా కాకుండా ప్రణాళికాబద్ధంగా నిర్వహించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టారు. జిల్లా మెడలో హరితహారం వేసేందుకు భారీ స్థాయిలో మొక్కల పంపకానికి సర్వం సిద్ధం చేశారు. ఈ వర్షాకాలం లోపే ఈ మొక్కలన్నింటిని పంపిణీ చేసేలా నిర్దిష్టమైన ప్రణాళికలను రూపొందించారు. స్థానిక పరిస్థితులు, వాతావరణానికి అనుగుణంగా మొక్కలను ఎంపిక చేసి, స్థానిక ప్రజల అవసరాలు, అభిరుచులకు అనుగుణంగా వాటిని పంపిణీ చేస్తున్నారు.

జిల్లాను ప్రకృతి వనంగా..

జిల్లాను ప్రకృతి వనంగా మార్చేందుకు 4.86 లక్షల మొక్కలను పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఈక్రమంలో గతేడాది సెప్టెంబరు నుంచే ముందస్తు కసరత్తును ప్రారంభించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, కంపా నిధులతో విత్తనాలు, చిన్నస్థాయి మొక్కలను తెచ్చి నర్సరీల్లో పెంచటం మొదలు పెట్టారు. వాటికి నీరు పోయటం, కలుపు తీయటం కోసం ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి, కొన్ని నెలలుగా వాటిని సంరక్షిస్తున్నారు.

34 రకాలను మొక్కలను ఎంపిక చేసి

ప్రజలకు పంపిణీ చేసేందుకు 34 రకాల మొక్కలను ఎంపిక చేసి, జిల్లావ్యాప్తంగా ఏడు కేంద్రాల్లో వాటిని పెంచుతున్నారు. నగర శివారులోని విజయవనం, వెల్దుర్తి, మదార్‌పురం, కరివేముల, గోనెగండ్ల, బోడేబండ, కాల్వబుగ్గ నర్సరీలు ఇందుకు కేంద్రంగా నిలిచాయి. వీటిలో పూలు, పండ్లు, నీడనిచ్చే మొక్కలతో పాటు ఔషధ గుణాలు ఉన్న మొక్కలను సైతం నర్సరీలలో సంరక్షిస్తున్నారు. వేప, కానుగ, నిమ్మ, ఉసిరి, బాదం, జామ, నేరేడు, సీతాఫలం, బొప్పాయి, చింత, మునగ, టెకుమా, టేకు, వెదురు, వంటి ప్రధానమైన రకాల సైతం ఈ సర్సరీల్లో అందుబాటులో ఉంచటం విశేషం.

నర్సరీల వద్ద మొక్కలను పొందవచ్చు



అటవీ శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా మొక్కలను పంపిణీ చేస్తున్నాం. ఆసక్తి కలిగిన వారు తమకు సమీపంలోని అటవీశాఖ ఏర్పాటు చేసిన నర్సరీల వద్దకు వెళ్లి మొక్కలను పొందవచ్చు. పెద్ద మొత్తంలో మొక్కలు కావాల్సి వస్తే మాత్రం ఉన్నతాధికారుల అనుమతి తీసుకోవాల్సిందే. పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి.

పి.శ్యామల, జిల్లా అటవీశాఖ అధికారి, కర్నూలు.

ఒక వ్యక్తికి వంద మొక్కలను..

మొక్కలను అటవీశాఖ అధికారులు ఉచితంగానే పంపిణీ చేస్తున్నారు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా 1.51 లక్షల మొక్కలను ప్రజలకు అందజేశారు. మొక్కల పంపిణీకి కొన్ని సాధారణ అనుమతులు అవసరమైన, చాలా వరకు వాటిని ఉదారంగానే అందజేస్తున్నారు. ఇప్పటికే ప్రపంచ పర్యావరణ దినోత్సవం, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం సందర్భంగా కొన్ని వేల మొక్కలను అవసరార్థులకు అందజేశారు. ఆసక్తి కలిగిన వారు, సరైన స్థల విస్తీర్ణాన్ని చూపిస్తే ఒక వ్యక్తికి వంద మొక్కలను సైతం ఇచ్చేందుకు అటవీశాఖ అధికారులు అనుమతులు ఇస్తున్నారు. వందకు మించి అవసరమైతే మాత్రం జిల్లా ఉన్నతాధికారుల అనుమతి పత్రాలు తప్పనిసరి చేశారు.



మొక్కల సంరక్షణ బాధ్యతల్లో కార్మికులు

రుణజాలం



5వ పేజీ తరువాయి

అందులో తమ కుటుంబ సభ్యులకు 60 సెంట్లు భూమి ఉన్నట్లు ఫోర్జరీ డాక్యుమెంట్లను సంబంధిత బ్యాంకు సీఈవోతో కుమ్మక్కై సృష్టించారు. 60 సెంట్లకు సంబంధించిన భూమి రూ.కోట్లలో పలుకుతుందని బ్యాంకులో ఉన్న ఇతర అధికారులను బురిడీ కొట్టించి రూ.3.24 కోట్లు రుణాన్ని పొందారు.

నోటీసులు పంపినా స్పందించకపోవడంతో..

బ్యాంకులో రుణం తీసుకుని మూడేళ్లయినా తిరిగి కంతులు చెల్లించకపోవడంతో సదరు రుణగ్రహీతలకు అసలుతో పాటు వడ్డీ చెల్లించాలని నోటీసులు పంపారు. నోటీసులు అందుకున్న రుణగ్రహీతలు కనీసం స్పందించకపోవడంతో తనఖా పెట్టిన భూ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కనీసం బ్యాంకులో తనకా పెట్టిన భూమిని వేలం వేసి రికవరీ చేసుకుందామని బ్యాంకు అధికారులు భావించారు. ఆ మేరకు తనఖా పెట్టిన భూమి సర్వేనంబర్‌తో పాటు వేలం వేస్తున్నట్లు పత్రికా ప్రకటన ఇచ్చారు. సంబంధిత భూమి టీచర్స్ సొసైటీకి విక్రయించిన భూమి అని దాన్ని ఎవరూ అమ్మడానికి, కొనడానికి వీలులేదని సంబంధిత వ్యక్తులు బ్యాంకు అధికారుల దగ్గరకు వచ్చి వివరాలను అందించారు.

60 సెంట్ల భూమిపై విచారణ

2024 డిసెంబర్ 4వ తేదీన ఆదోని సబ్‌రిజిస్టర్ కార్యాలయంలో సర్వేనంబర్ 24లో ఉన్న 60 సెంట్లు భూమిపై విచారణ చేపట్టారు. డాక్యుమెట్లను పరిశీలించిన సబ్‌రిజిస్టర్ ఫోర్జరీ డాక్యుమెంట్లు అని అందులో సంతకాలతో పాటు అందుకు వాడిన సీళ్లు అంతా ఫోర్జరీ అని నిర్ధారించారు. అప్పటి బ్యాంకు చైర్మన్ రాయచోటి సుబ్బయ్య ఈవిషయంపై సీఈవోకు నోటీసులు పంపించారు. రూ.3.24 కోట్ల విలువచేసే ఫోర్జరీ పత్రాలపై బాధ్యత వహించాలంటూ మెమో జారీ చేశారు. అదేరోజు ఆయనను బ్యాంకు విధుల నుంచి సస్పెండ్ చేస్తూ తీర్మానించారు. మూడు నెలలు గడువు ఇవ్వాలని రుణం పొందిన మొత్తాన్ని తిరిగి చెల్లించే విధంగా హామీతో పాటు అగ్రిమెంట్ రాయించారు. మూడు నెలలు గడువు ముగిసినా సీఈవో గట్టు మురళికుమార్ స్పందించకపోవడంతో ఒకటవ పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ శ్రీరామ్‌ను ఆశ్రయించారు. కేసు నమోదు చేయాలని రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. 2025 మార్చి 29వ తేదీన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు ఎఫ్ఐఆర్‌ను కూడా నమోదు చేశారు.

పలు అనుమానాలకు..

పట్టణంలోని ప్రముఖ పారిశ్రామికవేత్త కుటుంబం కావడం.. ఆర్థిక పరంగా స్థిరపడ్డ అప్పటి సీఈవో గట్టు మురళికుమార్ కూడా సహకరించడంతో వీరందరిని పోలీసులు అరెస్టు చేయకుండా జాప్యం చేయడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. అసలు సూత్రధారి నాటి సీఈవో గట్టు మురళికుమార్ సహకారంతోనే ఫోర్జరీ సంతకాలతో నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి నిందితులు ఎల్లే మల్లేశప్ప, ఎల్లే చెన్నబసవ, ఎల్లే చైత్ర రుణాన్ని పొందారన్నది జగమెరిగిన సత్యం. బ్యాంకు సీఈవో పాలకవర్గాన్ని తప్పుదోవ పట్టించి రూ.కోట్లు రుణాన్ని పొంది మోసం చేశారని బ్యాంకు పాలకవర్గం ఆరోపిస్తుంది. వంద రోజులు పైబడినా అరెస్టు చేయకుండా పోలీసులు కాలయాపన చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పరారీలో ఉన్నారని..

బ్యాంకు చైర్మన్ పాలకవర్గం ఫిర్యాదుతో పేర్కొన్న నలుగురిపై పలు సెక్షన్లపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి వారు పరారీలో ఉన్నారని పోలీసులు చెబుతున్న మాట. హైకోర్టులో ముందస్తు బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేసుకున్నారు. కోర్టు నిందితులకు బెయిల్ మంజూరు చేయకుండా తిరస్కరించింది. అయినా పోలీసులు వారిని అరెస్టు చేయడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారు.

ఎస్పీకి కూడా ఫిర్యాదు..

లక్ష్మమ్మవ్వ బ్యాంకులో చోటు చేసుకున్న అవకతవకలపై ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు బ్యాంకు పాలకవర్గం ఫిర్యాదు చేసింది. ఫోర్జరీ సంతకాలతో బురిడీ కొట్టించిన వైనాన్ని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. సీఈవోను వెంటనే అరెస్టు చేసి నలుగురిని రికవరీ చేయాలని కోరారు. అందుకు ఎస్పీ సానుకూలంగా స్పందించి త్వరలో సంబంధిత నిందితుడిని అరెస్టు చేసి విచారణ చేస్తామని హామీ ఇచ్చినట్లు పాలకవర్గం సభ్యులు కూడా తెలిపారు.

ఆ అదృశ్య శక్తులు ఎవరు?

ఆ నలుగురిని పోలీసులు అరెస్టు చేయకుండా కాపాడుతున్న అదృశ్య శక్తులు ఎవరన్నది అంతు చిక్కని ప్రశ్నగా మారింది. వన్‌టౌన్ సీఐ శ్రీరామ్ ఎన్నో కేసులను ఛేదించారు. ఈ కేసుపై విచారణతో పాటు వారిని అరెస్టుచేయకుండా జాప్యం చేయడంపై పలు అనుమానాలకు తావిస్తుంది. రాజకీయ ఒత్తిళ్లతోనే వారిని అరెస్టు చేయకుండా కాపాడుతున్నారా? లేక పోలీసులే నిర్లక్ష్యం చేస్తున్నారా? అన్నది తెలియాల్సి ఉంది. మరోవైపు నిందితులకు అధికార, ప్రతిపక్ష నాయకులతో మంచి సంబంధాలు ఉండడంతోనే జాప్యం జరుగుతున్నట్లు తెలిసింది. పోలీసులపై ఒత్తిడి తెచ్చి అరెస్టు చేయకుండా తిరుగుతున్నారన్నది సమాచారం. దీనిపై జిల్లా పోలీసులు ఉన్నతాధికారులే తేల్చాల్సి ఉంది.

అభివృద్ధిపై 'కూటమి'తో బహిరంగ చర్చకు సిద్ధం

- రాయలసీమను రాళ్ల సీమగా మార్చిన చంద్రబాబు
- మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి సవాల్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

కర్నూలు న్యూసిటీ, జూలై 18(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధిపై సీఎం చంద్రబాబుతో అయిన, టీడీపీ నేతలతో బహిరంగ చర్చకు సిద్ధమని మాజీ ప్రభుత్వ విప్, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి సవాల్ విసిరారు. శుక్రవారం ఎస్వీ కాంప్లెక్స్‌లోని సమావేశ భవనంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబు హయాంలో ఫ్యాక్షన్‌ను పెంచి పోషించడంతో రాయలసీమను రాళ్ల సీమగా మార్చి వ్యక్తిగా చంద్రబాబు చరిత్రలో నిలిచిపోతారని అన్నారు. 'సీమ'లో ప్రాజెక్టులను నాశనం చేసిన చంద్రబాబు మాజీ సీఎం జగన్‌ను విమర్శించడం తగదన్నారు. కర్నూలుకు వచ్చిన హైకోర్టు, లా యూనివర్సిటీని తరలించుకుపోవడం దారుణమన్నారు. 16 ఏళ్లుగా సీఎం చంద్రబాబు ఏమి సాధించారో ప్రజలకు వివరించాలని ఆయన డిమాండ్ చేశారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఇరగేషన్, వ్యవసాయానికి ప్రాధాన్యత ఇచ్చారని గుర్తుచేశారు. జగన్ ఐదేళ్లలో చేసిన అప్పుల్లో చంద్రబాబు ఏడాదిన్నరలో 55 శాతం అప్పులు చేశారన్నారు. చంద్రబాబు చేసిన అప్పులు ఎవరు తీర్చాలని ఆయన ప్రశ్నించారు. మేయర్ బీవై.రామయ్య, డిప్యూటి మేయర్ సిద్దారెడ్డి రేణుక, కార్పొరేటర్ ఎస్‌టీ.షేక్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సంజామల, జూలై 18,(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ఎగిరి రోటరీ పిల్లర్‌పై పడి తీవ్ర గాయాలకు గురైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషాద సంఘటన మండల కేంద్రమైన సంజామలలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ రమణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చాకలి నాగరాజు (31) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేసేవాడు. గురువారం సాయంత్రం సంజామల సమీపంలో వరిమడిలో రోటావేటర్‌తో సేద్యం చేస్తూ ప్రమాదవశాత్తు ఎగిరి రోటరీ పిల్లర్‌పై పడి తీవ్ర గాయాలకు గురయ్యాడు. బంధువులు వైద్యచికిత్స నిమిత్తం కోవెలకుంట్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. మృతుడి భార్య గర్భిణి, ఆరునెలల కూతురు ఉన్నారు. మృతదేహానికి శవ పరీక్ష చేయించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమణయ్య వివరించారు.

మరుగుదొడ్లకు తాళం తెరిచారు

- స్పందించిన ఆర్‌టీసీ రీజనల్ చైర్మన్ పూల నాగరాజు
- నీటి సౌకర్యం కల్పించడంపై విద్యార్థుల హర్షం



మాట్లాడుతున్న ఎంఈవో కబీర్ సాబ్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హొళగుంద, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జడ్పీహెచ్ఎస్‌లో 1873 మంది విద్యార్థులు నాలుగు మాధ్యమాల్లో చదువుకుంటున్నారు. ఈ పాఠశాలకు 2018 లో కేంద్ర ప్రభుత్వం 12 మరుగుదొడ్లు, టాయిలెట్లు నిర్మించింది. పాఠశాల నిర్వాహకులు నిర్వహణ లోపంతో ఇప్పటికే నాలుగు మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరడంతో పాటు నీటి సౌకర్యం లేకపోవడంతో దుర్వాసన కంపుకొడుతున్నాయి. మిగతా మరుగుదొడ్లకు ఉపాధ్యాయులు తాళం వేయడంతో విద్యార్థులు మూత్ర విసర్జనకు పాఠశాల నుంచి కిలో మీటర్ల దూరం వెళ్లాల్సి వస్తుంది. ఈ నెల 17వ తేదీన 'ఆంధ్రజ్యోతి'లో మరుగుదొడ్లుకు తాళం వేసినట్లు శీర్షిక ప్రచురితమైంది. స్పందించిన ఆర్టీసీ రీజినల్ చైర్మన్ పూల నాగరాజు, జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యూనిస్, ఎంఈవో కబీర్ సాబ్‌తో మాట్లాడి మరుగుదొడ్లుకు వేసిన తాళం తీయించారు. అలాగే నీటి సౌకర్యం కల్పించారు. దీంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

సీఎం మాటలు హాస్యాస్పదం

- కాంగ్రెస్ హయాంలోనే హంద్రీనీవా 90శాతం పూర్తి
- ఏఐసీసీ సభ్యుడు జే.లక్ష్మీనరసింహయాదవ్




మాట్లాడుతున్న ఏఐసీసీ సభ్యుడు జే.లక్ష్మీనరసింహయాదవ్

కల్లూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు గురువారం మల్యాల ఎత్తిపోతల పథకం వద్ద నీటిని విడుదల చేసి ఈప్రాజెక్టును నేనే పూర్తిచేశానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఏఐసీసీ సభ్యుడు, నంద్యాల డీసీసీ అధ్యక్షుడు జే.లక్ష్మీనరసింహయాదవ్ ఎద్దేవా చేశారు. శుక్రవారం నంద్యాల చెక్‌పోస్టులోని దామోదరం సంజీవయ్య కాంగ్రెస్‌భవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే హంద్రీనీవా పనులు 90 శాతం పూర్తయ్యాయని అన్నారు. సీఎం చంద్రబాబు అబద్ధాలు చెబుతున్నారని, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ హంద్రీనీవా ప్రాజెక్టు డిజైన్ మాత్రమే పూర్తి చేశారన్నారు. 2004లో ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో హంద్రీనీవా కాలువ పనులు 90 శాతం పూర్తిచేశారని స్పష్టం చేశారు. 2012లో నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో ట్రయరన్ ప్రారంభించారని తెలిపారు. హంద్రీనీవా కాలువపై మాజీ వ్యవసాయ శాఖ మంత్రి ఎన్.రఘువీరారెడ్డి మల్యాల నుంచి జీడీపల్లి వరకు పాదయాత్ర చేశారన్నారు. కార్యక్రమంలో జనార్దన్, బాలస్వామి, పఠాన్ అభిఖాన్ తదితరులు పాల్గొన్నారు.

హ్యాక్ చేసి.. ఖాతా ఖాళీ చేశారు..

- విడతలవారీగా రూ.28వేలు మాయం
- సైబర్ నేరగాళ్ల వలలో బైక్ మెకానిక్



బైక్ మెకానిక్ కురువ వీరేష్

కోసిగి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): వాట్సాప్ గ్రూపులో వచ్చిన యాప్‌ను క్లిక్ చేయగానే ఫోన్‌ను హ్యాక్ చేశారు. బ్యాంకు ఖాతా నుంచి విడతలవారీగా డబ్బును సైబర్ నేరగాళ్లు డ్రా చేసుకున్నారు. ఈ ఘటనతో బాధితుడు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు. వివరాలు.. కురువ వీరేష్ బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 13వ తేదీన అతడి వాట్సాప్ గ్రూపునకు పీఎం కిసాన్ యాప్' అనే మేసేజ్ వచ్చింది. ఈ యాప్‌పై అతడు క్లిక్ చేశాడు. కొద్దిసేపటికే సెల్ సిగ్నల్ కట్ అయిపోయింది. ఫోన్ సమస్య వచ్చిందని బాధితుడు ఫోన్ రిపేరీ షాపుకెళ్లాడు. మెకానిక్‌కు చూపించగా సెల్ ప్రాబ్లమ్ అని చెప్పడంతో జియో సిమ్ కేర్‌కు వెళ్లగా మీ ఫోన్ హ్యాక్ అయిందని తెలిపారు. అనంతరం కోసిగిలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో తన ఖాతాలో డబ్బులు పరిశీలించుకోగా ఖాతాల్లో రూ.28వేలు సైబర్ నేరగాళ్లు విడతలవారీగా ఈ నెల 13 నుంచి డ్రా చేసుకున్నట్లు బ్యాంకు అధికారులు తెలిపారని బాధితుడు వీరేష్ వాపోయాడు. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా సైబర్ క్రైం పోలీసులకు 1930కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఆ నంబర్‌కు ఫోన్ చేయగా ఎవరూ లిఫ్ట్ చేయలేదని, తనకు న్యాయం చేయాలని బాధితుడు వేడుకుంటున్నాడు.

వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతి

- ప్రభుత్వ ఆసుపత్రిని ముట్టడించిన మృతుడి కుటుంబ సభ్యులు



మృతుడి బంధువులతో మాట్లాడుతున్న ఆసుపత్రి సూపరింటెండెంట్



ఆంజనేయులు మృతదేహం పట్టుకొని రోదిస్తున్న సోదరి లక్ష్మి

ఆదోని రూరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): వైద్యుల నిర్లక్ష్యంతోనే ఆంజనేయులు(30) మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. వారు తెలిపిన వివరాలివీ.. రాయనగర్‌లో నివాసం ఉంటున్న ఆంజనేయులు, రోజమ్మకు ఇద్దరు సంతానం. వెల్డర్‌గా పనిచేస్తూ, కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శుక్రవారం ఉదయం 7గంటల సమయంలో ఆంజనేయులుకు యదనొప్పి వచ్చింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆదోని ఆసుపత్రికి తరలించారు. డ్యూటీలో ఉన్న వైద్య సిబ్బంది ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం అతడిని ఇం టికి పంపించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇంటికెళ్లిన కొద్ది సేపటికీ ఆంజనేయులు కుప్పకూలాడు. హుటాహుటిన కుటుంబ సభ్యులు తిరిగి ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో ఆగ్రహానికి గురైన మృతుడి కు టుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. డ్యూటీ డాక్టర్ ఉన్నప్పటికీ రూంలో నుంచి బయటకు రాలేదని, నర్సులే ఇంజక్షన్లు వేశారని ఆరోపించారు. కనీసం ఈసీజీ కూడా తీయలేదన్నారు. 'ఆంజనేయులు నీ బిడ్డ పిలుస్తోంది.. ఇంటికెళ్దాం.. మాట్లాడురా ఒకసారి... నన్ను చూడరా... మీ అక్కను వచ్చాను. ఒక సూదితో పొట్టన పెట్టుకున్నారు నిన్ను అంటూ ఆంజనేయులు సోదరి లక్ష్మి రోదిస్తున్న తీరు అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. టూటౌన్, వన్‌టౌన్ పోలీసులు ఆసుపత్రికి చేరుకొని వారిని నివారించే ప్రయత్నం చేశారు.

సిబ్బందికి చెప్పకుండా వెళ్లిపోయారు

చెస్ట్ పెయిన్ ఉందని ఆసుపత్రికి వచ్చిన ఆంజనేయులుకు డ్యూటీలో ఉన్న వైద్య సిబ్బంది చికిత్సలు చేశారు. కొద్దిసేపటికి వారు సిబ్బందికి చెప్పకుండా వెళ్లిపోయారు. ఇందులో సిబ్బంది నిర్లక్ష్యం లేదు.
- డాక్టర్ పద్మ కుమార్, సూపరింటెండెంట్

పెద్దాసుపత్రిలో అరుదైన యాంజియోప్లాస్టి



రోగి, కార్డియాలజి వైద్యులతో హాస్పిటల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

కర్నూలు హాస్పిటల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా మిడ్తూరుకు చెందిన 45 ఏళ్ల చంద్రావతి అనే రోగికి కార్డియాలజి వైద్యులు ఎడమ చేతి రక్తనాళ ధమనానికి సబ్‌క్లావియన్ యాంజియోప్లాస్టిని కర్నూలు జీజీహెచ్‌లో మొట్టమొదటి సారిగా విజయవంతంగా అమర్చారు. ఎడమచేయి నొప్పితో బాధపడుతూ జూన్ 27వ తేదీన మహిళ కర్నూలు జీజీహెచ్‌లోని కార్డియోథొరాసిక్ విభాగానికి వచ్చింది. అక్కడి నుంచి ఈ నెల 11వ తేదీన కార్డియాలజి విభాగంలో అడ్మిషన్ పొందింది. ఈ నెల 14వ తేదీన కార్డియాలజి విభాగపు అసిస్టెంట్ ప్రొఫెసర్లు కిరణ్ కుమార్ రెడ్డి ప్రశాంత్, రవికిరణ్, లలిత కుమారి, రాజ్‌కుమార్ వైద్యబృందం ఎలాంటి కుట్లు, కోత, మత్తు లేకుండా బ్లాక్ అయిన ఎడమ చేయి రక్తనాళాన్ని ఓపెన్ చేసి సబ్ క్లావియన్ యాంజియోప్లాస్టిని విజయవంతంగా నిర్వహించారు. ఈ చికిత్స వల్ల రోగి ఎడమ చేయి రక్తనాళం రక్తప్రవాహం మెరుగైంది. ఈ సందర్భంగా కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రెగ్యులర్‌గా గుండెకు స్టంట్స్ వేయడం జరుగుతుందని, అయితే చేయి రక్తనాళాలు పెద్దగా ఉంటాయని, ఈ స్టంట్‌ను హైదరాబాదు నుంచి తెప్పించామన్నారు. కర్నూలు జీజీహెచ్‌లో మొట్టమొదటి సారిగా ఎన్టీఆర్ వైద్యసేవ కింద విజయవంతంగా నిర్వహించినందుకు కార్డియాలజి హెచ్‌వోడీ డాక్టర్ ఆదిలక్ష్మి వైద్యులను అభినందించారు. కార్యక్రమంలో హాస్పిటల్ డిప్యూటి సూపరింటెండెంట్ డి.శ్రీరాములు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

చెట్టును ఢీకొన్న కారు

- భార్య మృతి.. భర్తకు తీవ్ర గాయాలు

ఎమ్మిగనూరు రూరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో భార్య మృతి చెందగా భర్త తీవ్రంగా గాయపడిన ఘటన శుక్రవారం సాయంత్రం జరిగింది. ఎమ్మిగనూరు రూరల్ పోలీసులు తెలిపిన వివరాలివీ.. కర్నూలులో బంగారు వ్యాపారం చేస్తున్న రామకృష్ణ, భార్య లక్ష్మీబాయి(52)తో కలిసి కర్ణాటక రాష్ట్రం సిరిగుప్పలో ఉన్న తమ బంధువులను చూసేందుకు కారులో బయల్దేరారు. అయితే ఎమ్మిగనూరు సమీపంలోని ఎర్రకోట ఇంజినీరింగ్ కళాశాల దగ్గరకు రాగానే కారు కుడివైపు ఉన్న చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మీబాయి తలకు తీవ్ర రక్తగాయాలు కాగా, భర్త రామకృష్ణ కుడి కాలు విరిగింది. స్థానికులు చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ లక్ష్మీబాయి మృతి చెందారు. పోలీసులు కేసుదర్యాప్తు చేస్తున్నారు. మృతురాలు లక్ష్మీబాయికు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

బైకు అదుపుతప్పి ఒకరి దుర్మరణం

నందికొట్కూరు రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు మండలం జాతీయ రహదారి నాగలూటి క్రాస్ వద్ద బైక్ ప్రమాదంలో సోమన్న (58) అనే వ్యక్తి మృతి చెందగా.. రాము అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. వివరాలివీ.. మిడుతూరు మండలం ఉప్పలదడియ గ్రామానికి చెందిన సోమన్న, రాము బైక్‌పై పని నిమిత్తం నందికొట్కూరుకు వచ్చి తిరుగు పయనమయ్యారు. అయితే నాగలూటి క్రాస్ వద్ద జాతీయ రహదారి పై బైక్ అదుపు తప్పి కింద పడిన ఘటనలో ప్రమాదానికి గురై సోమన్న (58) అక్కడికి అక్కడే మృతి చెందారు. రాముకు తీవ్రగాయాలు కాగా కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. బ్రాహ్మణకొట్కూరు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిరుపాలు తెలిపారు.

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య

కర్నూలు క్రైం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఉలిందకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో కొంగనపాడు గ్రామంలో వెంకటేష్ (45) అనే రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వెంకటేశ్ గ్రామంలో 1.5 ఎకరాల పొలాన్ని సాగు చేసుకునేవాడు. వ్యవసాయంలో నష్టాలు రావడంతో పాటు అప్పులు ఎక్కువ కావడంతో మనస్తాపానికి గురైన రైతు వెంకటేశ్ ఇంటిలో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువులు గుర్తించి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు సంతానం ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఉలిందకొండ ఎస్ఐ ధనుంజయ తెలిపారు.

అనాలోచిత విధానాలతో ఆర్థిక వ్యవస్థ నాశనం

-మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ



పడకండ్లలో ప్రభుత్వ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

ఆళ్లగడ్డ, జూలై 18(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ అనాలోచిత విధానాల వల్ల ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైందని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ అన్నారు. శుక్రవారం ఆళ్లగడ్డ మండలంలోని పడకండ్ల గ్రామంలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆధ్వర్యంలో నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాల అమలు గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కాలనీ వాసులు మురికి కాలువలు లేక ఇబ్బందులు పడుతున్నామని మంత్రి దృష్టికి తీసుకెళ్లగా, తక్షణ సహాయంగా రూ.25 లక్షలు మంజూరు చేసి రేపటి 24 గంటల్లో పనులు చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అలాగే మున్సిపాటి పరిధిలో కాలువలు, మంచినీరు, రోడ్ల కోసం నివేదికలు తయారుచేసి పంపాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒక వైపు ఖజానాలో నిధులు తక్కువగా ఉన్నా సీఎం చంద్రబాబు నాయుడు వెనక్కు తగ్గకుండా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు జిల్లా వ్యాప్తంగా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు తె లిపారు. 2014-2019 తాము మంజూరు చేసిన రూ.5,350 కోట్ల ప్రాజెక్టులను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిశోర్, కౌన్సిలర్ హుసేన్ బాషా, టీడీపీ నాయకులు బద్రి సుధాకర్‌రెడ్డి, నూలం నరసింహులు, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన సరదా

- ప్రైవేట్ భాగాలపై తన్నడంతో కిందపడి వ్యక్తి మృతి
- స్నేహితుడిపై హత్య కేసు నమోదు

మంత్రాలయం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం బస్టాండు సమీపంలో ఇద్దరు స్నేహితులు సరదాగా ఆడుకుంటూ కింద పడడంతో ఒకరు మృతి చెందారు. మంత్రాలయం ఎస్ఐ శివాంజల్ తెలిపిన వివరాలివీ.. కర్ణాటకలోని రాయచూరు జిల్లా మల్కాపురం గ్రామానికి చెందిన బోయ దుల్లయ్య (36), మంత్రాలయం మండలం మాధవరం గ్రామానికి చెందిన తలారి దుగ్గు రామకృష్ణ ఇద్దరూ ట్రాక్టరు డ్రైవర్లుగా, హమాలీలుగా, హోటల్‌లో పని చేస్తూ స్నేహితులుగా ఉంటూ వచ్చారు. గురువారం రాత్రి ట్రాక్టర్ కొండీని విరగొట్టావని ఒకరు, లేదని మరొకరు తమాషాగా భుజాల మీద చేయి వేసుకుంటూ చిలిపిచేష్టలు చేస్తూ వచ్చారు. దుగ్గు రామకృష్ణ సరదగా చేస్తూ ప్రైవేటు భాగాలపై తన్నడంతో కింద పడి తలకు రక్తగాయాలై దుల్లయ్య అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటన ప్రైవేటు హోటల్ సీసీ కెమెరాల్లో రికార్డయింది. గురువారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందారని, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. అయితే సీసీ ఫుటేజీని క్షుణ్ణంగా పరిశీలించి దుగ్గు రామకృష్ణ తన్నడం వల్లే కిందపడి మృతి చెందారని దుల్లయ్య సోదరుడు ఆంజనేయ ఫిర్యాదు చేశారు. దీంతో ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు, కర్నూలు క్లూస్ టీం ఎస్ఐ పవన్‌కుమార్ రెడ్డి, మంత్రాలయం సీఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్, అన్వర్‌బాషా శుక్రవారం ఘటనా స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. మృతదేహానికి ఎమ్మిగనూరు ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. కర్ణాటకలోని దుల్లయ్య తల్లి యంకమ్మ, అన్న ఆంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

కర్నూలు క్రైం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇరువర్గాలపై కేసు నమోదైంది. టీడీపీకి చెందిన మహబూబ్ ఖాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జావీద్, యూనిస్ మరికొంత మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే యూనిస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మహబూబ్ ఖాన్, ఆయన అనుచరులపై కేసు నమోదు చేసినట్లు సీఐ రామయ్య నాయుడు తెలిపారు. మహబూబ్ ఖాన్ వడ్డెగేరిలో ఉన్న వైసీపీ కార్యాలయంపై దాడి చేశాడు. దీనిని మనసులో పెట్టుకున్న జావీద్, యూనిస్ అనుచరులు దాడి చేయడంతో మహబూబ్ ఖాన్ గాయపడ్డాడు. ప్రస్తుతం మహబూబ్ ఖాన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించండి

ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రప్ప


జిల్లా గిరిజన సంక్షేమ అధికారికి వినతిపత్రం ఇస్తున్న టీఎస్ఎఫ్ నాయకులు

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): గిరిజన ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.చంద్రప్ప కోరారు. శుక్రవారం జిల్లా గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో సంక్షేమ అధికారి కొండయ్యను టీఎస్ఎఫ్ నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. చంద్రప్ప మాట్లాడుతూ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో దీర్ఘకాలికంగా ఉపాధ్యాయులు పని చేస్తున్నప్పటికీ పదోన్నతులు లేక అన్యాయానికి గురవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, టీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామరాజు, కార్యదర్శి వెంకటేశ్, షేక్షావలి పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

ఓర్వకల్లు, జూలై 18(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం మండలంలోని ఓర్వకల్లు జీవేశ్వరస్వామి ఆలయంలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమంపై మండల స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. సాయంత్రం మోసం గ్యారెంటీ.. ఇంటింటికి వంచన కార్యక్రమం నిర్వహించారు. కాటసాని మాట్లాడుతూ గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ క్యూఆర్ కోడ్ ద్వారా గత ఏడాది కాలంలో ప్రతి కుటుంబం ఎంత నష్టపోయిందో వివరించారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రంగనాథగౌడు, విష్ణువర్ధన్‌రెడ్డి శంకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, తిప్పన్న, చెన్నారెడ్డి, హరినాథగౌడు, నాగతిరుపాలు, రమణారెడ్డి, మధుసూదన్ పాల్గొన్నారు.

టీసీ లక్ష్మమ్మకు నివాళి


టీసీ లక్ష్మమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మహిళలు

కర్నూలు న్యూసిటీ, జూలై 18(ఆంధ్రజ్యోతి): మహిళా ఉద్యమ నేత టీసీ లక్ష్మమ్మ 10వ వర్ధంతిని నగరంలోని పలు ప్రాంతాలలో నిర్వహించారు. శుక్రవారం ముజఫర్‌నగర్ టీసీ లక్ష్మమ్మ కుట్టు శిక్షణ కేంద్రం, సుందరయ్య భవన్, కేకే భవన్, 37వ వార్డు వీకర్‌సెక్షన్ కాలనీ, సోమిశెట్టి నగర్‌లో జిల్లా మహిళా సంఘం అధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సాహితి స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు మాట్లాడుతూ టీసీ లక్ష్మమ్మ మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, వరకట్నపు వేధింపులపై ఆమె పోరాటాలు చేశారన్నారు. ఐద్వా జిల్లా కార్యదర్శి ఎస్. అలివేలు, మహిళా సంఘం జిల్లా అధ్యక్షు రాలు జి.ధనలక్ష్మి, జే.లక్ష్మీబాయి, సుధాకరప్ప, ప్రభాకర్ పాల్గొన్నారు.

అనుమతి లేకుండా విద్యుత్ వినియోగిస్తే చర్యలు

సి.బెళగల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా విద్యుత్ వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని ఏడీ జేసన్ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రమైన సి.బెళగల్‌లో విద్యుత్ వినియోగదారులతో ఆయన సమావేశమయ్యారు. ఏడీ జేసన్ మాట్లాడుతూ వినియోగదారులు విద్యుత్ బకాయిలను సకాలంలో చెల్లించాలన్నారు. పెళ్లిలకు విద్యుత్ వినియోగించే ముందు అధికారుల అనుమతి తీసుకోవాలన్నారు. ఈసమావేశంలో లైన్‌మెన్లు, వినియోగదారులు పాల్గొన్నారు.

పంటలకు ప్రాణం పోసిన వర్షం

● రైతుల్లో ఆనందం

ఓర్వకల్లు, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు పంటలకు ప్రాణం పోశాయి. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్‌లో ఓ మోస్తరు వర్షం పడటంతో రైతులు విత్తనాలు విత్తారు. 45 రోజులైనా వరుణదేవుడు కరుణించకపోవడంతో పంటలన్నీ వాడుముఖం పట్టాయి. వరుణదేవా.. కరుణించవయ్యా అంటూ రైతులు మొక్కుకున్నారు. మండలంలోని ఓర్వకల్లు, కన్నమడకల, పూడిచర్ల, నన్నూరు. లొద్దిపల్లె, మీదివేముల, ఉయ్యాలవాడ, హుశేనాపురం, సోమయాజులపల్లె తదితర గ్రామాల్లో పత్తి 3,250 హెక్టార్లు, కంది 272 హెక్టార్లు, మొక్కజొన్న 1141 హెక్టార్లు, వేరుశనగ 115 హెక్టార్లు, కొర్ర 142 హెక్టార్లు, ఉల్లి 200 హెక్టార్లు వివిధ పంటలు 500 హెక్టార్లలో రైతులు సాగు చేశారు. సరైన వర్షం లేక పంటలు వాడిపోతుండటంతో రైతులు ఆందోళన చెందారు. పెట్టుబడుల కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలని దిగాలు చెందారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో పంటలు కళకళ లాడుతున్నాయి.


కళకళలాడుతున్న పత్తి పంట

ఈ వర్షం పంటలకు ప్రాణం పోసింది


గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షం పంటలకు ప్రాణం పోసింది. దిగుబడులు కూడా బాగా వచ్చే పరిస్థితులు ఉన్నాయి. తాను 20 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశాను.

● మోహన్‌రెడ్డి, రైతు, గుట్టపాడు

సబ్సిడీ విత్తనాలు అందించాలి


వర్షాభావంతో గత ఏడేళ్లుగా పంటలు వాడుముఖం పడుతున్నాయి. దిగుబడి రాక రైతులు అప్పులవలయంలో కూరుకుపోయారు. ప్రభుత్వం స్పందించి రైతులకు సబ్సిడీ విత్తనాలు అందించాలి.

● పుల్లారెడ్డి, రైతు, పూడిచెర్ల

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు న్యూసిటీ, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ఆర్టీసీలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీఎస్ ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మునిస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు లేబర్ యాక్టు ప్రకారం రావాల్సిన వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్‌లు సక్రమంగా కాంట్రాక్టర్లు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ, పండుగల సెలవులు వర్తించేలా ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేవారు. ఈ సమావేశంలో నాయకులు కృష్ణా, ఎండీ అనిఫ్, నవీద్, రాము పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

ఎంపీడీవో రాణెమ్మ

సి.బెళగల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీడీవో రాణెమ్మ పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. గ్రామాల్లోని ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతపై దృష్టి సారించాలన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు తాగునీరు వేడి చేసుకుని తాగాలని సూచించారు. ఈసమావేశంలో ప్రత్యేక అధికారి రమణారెడ్డి, ఎంఈవో ఆదాంబాషా, డిప్యూటీ ఎంపీడీవో మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

జాయింట్ ఎల్‌పీఎంతో పథకాలు అందడం లేదు: సీపీఎం


తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

కల్లూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): రీసర్వేలో భాగంగా మండలంలోని ఉలిందకొండ, కొల్లంపల్లి తాండ గ్రామాల్లోని 86 మంది రైతుల భూములను జాయింట్ ఎల్‌పీఎంగా చూపించారని, దీంతో వారు తల్లికివందనం, అన్నదాత సుఖీభవ పథకాలు అందడంలేదని రైతుసంఘం జిల్లా ప్రదాన కార్యదర్శి జి.రామకృష్ణ అన్నారు. రైతుసంఘం మండల కార్యదర్శి కృష్ణ, సీఐటీయూ మండల కార్యదర్శి కె.మధు ఆధ్వర్యంలో కల్లూరు తహసీల్దారు కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ ఉలిందకొండ, కొల్లం పల్లి తాండ గ్రామాల్లో జాయింట్ ఎల్‌పీఎం సమస్యను పరిష్కరించి రైతులకు ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం తహసీల్దారు కె.అంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పూల రంగడు, మారెన్న, రమేష్, గోపాల్‌నాయక్, వెంకటస్వామి, చిన్నశివమ్మ, రాధమ్మ, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని శిక్షించాలి


మాట్లాడుతున్న ఏపీ సుబ్బారెడ్డి

కర్నూలు హస్పిటల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): కర్నూలులో శ్రీచక్ర హాస్పిటల్‌పై దాడి చేసిన వారిపై 2008 ఏపీ మెడికేర్ సర్వీసెస్ యాక్టు ప్రకారం శిక్షించాలని ఏపీ ప్రైవేటు హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఏపీ సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం కర్నూలు వచ్చిన ఆయన పార్థసారధి నగర్‌లోని ఐఎంఏ భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 36 గంటల తర్వాత రోగి ఇచ్చిన మందు రియాక్షన్ వచ్చిందని చెప్పడం సరికాదన్నారు. హాస్పిటల్‌పై నిరాధారణ ఆరోపణలు చేశారన్నారు. రోగి తీసుకుని వచ్చిన వెంటనే డాక్టర్ చూసి చనిపోయాడని నిర్ధారణ చేశారని, బ్రాడ్ డెత్ అయిన రోగికి వైద్యులు ఎలా చికిత్స అందిస్తా రని ప్రశ్నించారు. హాస్పిటల్‌పై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం జిల్లా ఎస్పీని కలిశామన్నారు. ఈ సమావేశంలో ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్లు రామచంద్రనాయుడు, ఎస్వీ రామ్మోహన్ రెడ్డి, అప్నా అధ్యక్షుడు వేణుగోపాల్, ఐఎంఏ కోశాధికారి డా.మాధవీ, శ్యామల, శ్రీచక్ర హాస్పిటల్ అధినేత విజయకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

● పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి
● రూ.2.30 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కల్లూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): కల్లూరు అర్బన్ వార్డులో అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ పరిధిలోని 32, 35, 30, 36, 41 వార్డుల్లో రూ.2.30 కోట్లతో అభివద్ధి పనులకు నగర కమిషనర్ పి.విశ్వనాథ్‌తో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ అర్బన్ వార్డుల్లోని శివారు ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా చర్యలు తీసుకుంటు న్నామన్నారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఎన్‌క్యాప్ నిధులతో 32, 35వ వార్డుల పరిధిలో చెన్నమ్మసర్కిల్ నుంచి ఏపీఐఐసీ కార్యాలయం వరకు రూ.90లక్షలతో రహదారి విస్తరణ, 36వ వార్డు వై.జంక్షన్ నుంచి పెద్దపాడు వరకు రూ.25 లక్షలతో డివైడర్లలో పచ్చదనం పెంపు పనులకు శంకుస్థాపన చేశారు. సాధారణ నిధులతో 30వ వార్డులోని సుంకులమ్మగుడి నుంచి హంద్రినది వరకు రూ.49.95 లక్షలతో డిస్పోజబుల్ డ్రైన్, 37వ వార్డు శరీన్‌నగర్‌లో రూ.50 లక్షలతో సీసీ రోడ్లు, 41వ వార్డు సిద్దార్థహోమ్‌లో రూ.15 లక్షలతో సీసీ డ్రైన్ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నంద్యాల పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు కె.పార్వతమ్మ, కల్లూరు అర్బన్ వార్డుల ఇన్‌చార్జి పెరుగు పురుషోత్తంరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, పీయూ మాదన్న, పెద్దపాడు లోకేశ్వరరెడ్డి, ఎస్వీ.రామకృష్ణ, శ్రీనివాసరావు, శైలజాయాదవ్, కార్పొరేటర్ జయరాముడు, ఎస్.ఫిరోజ్, గంగాధర్‌గౌడ్, కేతూరు మధు, నగర పాలక ఇంజనీర్లు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

అన్న క్యాంటీన్ పరిశీలన: 41వ వార్డు పరిమళానగర్‌లోని అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, కమిషనర్ విశ్వనాథ్‌తో కలిసి పరిశీలించారు. పేదలకు రుచికరమైన భోజనం అందించాలని ఎమ్మెల్యే నిర్వాహకులను ఆదేశించారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం: సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అధికారులు సేవలందించాలని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. శుక్రవారం మాధవీనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అన్నివర్గాల ప్రజల నుంచి ఎమ్మెల్యే వినతులు స్వీకరించారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు అధికారులు సంయమనంతో మసలుకుని సేవలందించాలన్నారు.

రోడ్లకు మరమ్మతులు చేయండి

పీపీఎస్ఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు పుల్లారెడ్డి


మ్యాన్‌హోల్‌లో ఇరుక్కుపోయిన లారీని చూపిస్తున్న కమిటీ సభ్యులు

కర్నూలు న్యూసిటీ, జూలై 18(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాల్లో గుంతలు పడిన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇరిగినేని పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని పూలబజార్ కూడలిలో ఓ ట్రాన్స్‌పోర్టు వాహనం ప్రధాన రహదారిపై గుంతలో పడిపోవడంతో పరిశీలించారు. పుల్లారెడ్డి మాట్లాడుతూ శిథిలమైన గుంతలో లారీ పడటంతో త్రుటిలో ప్రమాదం తప్పిందన్నారు. కాల్వలపై ఇనుప మూతలు వేయకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు బాలకృష్ణ, తిరుపతయ్య, మహ్మద్, షేక్ షాకీర్, టి.రాము పాల్గొన్నారు.

కార్పొరేటర్‌పై చర్యలు తీసుకోవాలి

● 9వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి మహబూబ్ ఖాన్


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

కర్నూలు అర్బన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): నగరంలోని పదో వార్డు వైసీపీ కార్పొరేటర్ యూనిస్ తనపై దాడి చేశారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని 9వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి మహబూబ్ ఖాన్ కోరారు. శుక్రవారం సాయంత్రం దర్వేష్ ఖాద్రీ వద్ద ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. గురువారం రాత్రి బైక్‌పై ఇంటికి వెళ్తుండగా ఖడక్‌పుర ప్రాంతంలో కత్తి, ఇనుపరాడ్లతో కార్పొరేటర్ తనపై దాడి చేశారన్నారు. ఈదాడిలో కార్పొరేటర్ యూనిస్‌తోపాటు జావీద్ ఉన్నారని, వెంటనే స్థానికులు రావడంతో అక్కడి నుంచి వారు పారిపోయారన్నారు. లేదంటే తనను చంపేసేవార న్నారు. దీనిపై తన తరఫున పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

రైల్వే స్టేషన్‌లో చోరీ

కర్నూలు క్రైం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కర్నూలు రైల్వేస్టేషన్‌లో పట్టపగలే దొంగలు రెచ్చిపోయారు. ఓ మహిళ మెడలో నుంచి గొలుసు తెంపుకుని ఉడాయించారు. కాచిగూడ నుంచి గుంటూరు వెళ్లే రైలు శుక్రవారం మధ్యాహ్నం కర్నూలు రైల్వేస్టేషన్‌లో ఆగింది. ఈ రైలులో ప్రయాణిస్తున్న లక్ష్మీ ప్రసూనాంబ అనే మహిళ రైలులోని బాత్‌రూం వద్ద నిల్చుని ఉంది. అక్కడకు వచ్చిన ఓ ఆగంతకుడు కళ్లలో కారం కొట్టి ఆమె మెడలో నుంచి గొలుసు తెంపుకునే ప్రయత్నం చేశాడు. ఆ మహిళ అప్రమత్తమై గొలుసు గట్టిగా పట్టుకోగా.. అందులో సగభాగం తెంపుకుని ఉడాయించాడు. స్టేషన్ బయటకు పరుగెత్తుకుంటూ వచ్చి అప్పటికే సిద్ధంగా ఉన్న ఓ ఆటోను ఎక్కి పరారయ్యాడు. చోరీకి గురైన గొలుసు రెండుతులాలు ఉంటుందని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి


సబ్బులు, నూనెలు ఇస్తున్న ఎంపీడీవో, టీడీపీ నాయకులు

ఓర్వకల్లు, జూలై 18(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం ఓర్వకల్లులోని పంచాయతీ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు సోపు, నూనె, పండ్లు, ఫలహారాలు అందజేసి సన్మానించారు. ఎంపీడీవో మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు కరోనా సమయంలో ప్రాణాలు లెక్కచేయకుండా విధులు నిర్వహించారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, వీఆర్వో సోమన్న, పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి

కర్నూలు రూరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆయన కర్నూలు మండలం దిగువపాడు, శివరాంపురం గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి, కరపత్రాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే దస్తగిరి మాట్లాడుతూ రాబోయే 4 ఏళ్లలో సంక్షేమం, అభివృద్ధిలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయ కులు, గ్రామ పెద్దలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కల్లూరు: ఏడాది కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు ప్రజారంజక పాలన చేస్తున్నారని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కె.మార్కాపురంలో ఏపీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్, మండల కన్వీనర్ డి.రామాంజనేయులు ఆధ్వర్యంలో చేపట్టిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో రాఘవేంద్ర, శేఖర్, రవి, మద్దిలేటి, వెంకటరాముడు, మధుసూదన్, మురళీధర్ రెడ్డి, ఖాసీం, దేవేంద్రారెడ్డి పాల్గొన్నారు.

గూడూరు: ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని పట్టణ టీడీపీ అధ్యక్షుడు కురుకుంద రామాంజ నేయులు అన్నారు. శుక్రవారం గూడూరు నగరంలోని ఆయా కాల నీల్లో రామాంజనేయులు ఆధ్వర్యంలో సుపరిపాలన తొలి అడుగులో భాగంగా టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ రేమట వెంక టేశ్వర్లు, జిల్లా బీసీ సెల్ కార్యదర్శి నాగప్ప యాదవ్, టీడీపీ నాయకులు చాంద్ బాషా, పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు వీరకుమార్ పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని కౌన్సిలర్ మాల్లాపు బుడ్డంగలి అన్నారు. శుక్రవారం గూడూరులో సుపరి పాలన తొలి అడుగులో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సి.బెళగల్: ప్రజలు ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని టీడీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం పోలకల్లు బీసీ కాలనీలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు దూద్‌వలి, వెంకటేశ్వర్లు, సుంకన్న, మాదవస్వామి, హనుమంతుగౌడు, రాజు పాల్గొన్నారు.


ప్రజలకు కరపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: టీజీ భరత్


తణుకులో ప్రజలకు కరపత్రాన్ని అందిస్తున్న మంత్రి టీజీ భరత్

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. శుక్రవారం పశ్చిమగోదావరి జిల్లా తణుకు నియోజకవర్గం వేల్పూల గ్రామంలో ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణతో కలిసి సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడి ఏడాది పాలనలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు.

- కర్నూలు అర్బన్ (ఆంధ్రజ్యోతి)

నిరుద్యోగ భృతిని వెంటనే అమలు చేయాలి

మద్దికెర, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీ మేరకు రూ.3వేల నిరుద్యోగ భృతిని వెంటనే అమలు చేయాలని మండల సీపీఐ కార్యదర్శి నాగరాజు కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు ఇచ్చిన అన్ని రకాల హామీలను అమలు చేసి మాట నిలబెట్టుకోవాలన్నారు. నిరుద్యోగులకు ఉపాది ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కోదండరాముడు తదితరులు ఉన్నారు.

అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఈ

మద్దికెర, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మద్దికెర గ్రామంలో పలు సమస్యలు ఉన్నప్పటికీ మీరు ఎవరూ కూడా పట్టించుకోవడం లేదంటూ అధికారులపై ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక గ్రామ సచివాలయంలో సర్పంచ్ బండారు సుహాసిని అధ్యక్షతన అధికారుల సమావేశం జరిగింది. ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు వస్తున్నారని తెలిసి కూడా ఎంపీడీవో విధులకు హాజరు కాకపోవడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గ్రామానికి వస్తున్నారని తెలిసి కూడా ఏ అధికారి కూడా ఎందుకు రాలేదని ప్రశ్నిస్తున్నారు. మంగళి వీధిలో డ్రైనేజీ ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరారని తెలిపారు. అధికారులు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రధానబస్టాండు వద్ద గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను వెంటనే మార్చాలని కోరారు. సమావేశంలో పంచాయతీ సలహాదారులు ఆంజనేయులు, మాజీ జడ్పీటీసీ సభ్యులు రాజన్న యాదవ్, జిల్లా టీడీపీ కార్యదర్శి ధనుంజయుడు, చంద్రశేఖర్ గౌడు, లక్ష్మీనారాయణ ఉన్నారు.

సొసైటీ చైర్మన్‌కు సన్మానం

మద్దికెర, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బురుజుల గ్రామంలోని విశాల సహకార పరపతి సంఘం చైర్మన్ ఎర్రిస్వామిని టీడీపీ నాయకులు దర్శి శ్రీనివాసులు, ప్రదీప్‌నాయుడు, హరిబాబు శుక్రవారం సన్మానించారు. ఎర్రిస్వామి మాట్లాడుతూ సహకార సంఘాన్ని అభివృద్ధి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో సీఈవో మల్లికార్జున ఉన్నారు.

ప్రత్యేక పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలి

తుగ్గలి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నునుసురాళ్ల పంచాయతీకి ప్రత్యేక పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని టీడీపీ మండల అధ్యక్షులు తిరుపాల్ నాయుడు కోరారు. శుక్రవారం మండల కేంద్రమైన తుగ్గలి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రవిని కలిసి వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ బొందిమడుగుల రెవెన్యూలో ఉన్న నునుసురాళ్లలో 500 మంది ఓటర్లు ఉంటారని, వారు ఎమ్మెల్యే ఎన్నికల్లో బొందిమడుగులకు వచ్చి ఓటు వేయాల్సి వస్తుందని, ఓటు హక్కు వినియోగించుకోవాలంటే 3 కిలోమీటర్లు వెళ్లాల్సి వచ్చిందని, ప్రత్యేక బూత్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షులు రామాంజనేయులు, రంగారెడ్డి, రామచంద్ర, దేవదాసు, రాజన్న, తదితరులు ఉన్నారు.

విద్యుత్ తీగలు మార్చండి

మద్దికెర, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.అగ్రహారం బీసీ కాలనీలో విద్యుత్ తీగలు మార్చాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ ముందు బీసీ కాలనీవాసులు ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ లోవోల్టేజీతో ఇళ్లల్లో టీవీలు, బల్బులు కాలిపోయాయన్నారు. తీగలు మార్చాలని పలుమార్లు కోరినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం విద్యుత్ ఏఈ మహ్మద్ రఫీకి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బాలాంజనేయులు, పులిశేఖర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులతో బాధితులు, నాయకులు

ఆదోని, జూలై 18(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని 37 మంది లబ్ధిదారులకు రూ.17 లక్షలు విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి మీనాక్షినాయుడు, ఏపీ కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్పలు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేతలు దేవేంద్రప్ప, ఉమాపతినాయుడు, రంగన్న, రంగస్వామినాయుడు, వెంకటేష్, అంజి, అప్సర్‌బాషా, అల్తాఫ్, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకట్‌చౌదరి పాల్గొన్నారు.

కంపచెట్లు తొలగించాలి

దేవనకొండ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): దేవనకొండ నుండి వరిముక్కలకు వెళ్లే రహదారిలో కంపచెట్లను తొలగించాలని ఎంపీడీవో జ్యోతికి వరిముక్కల గ్రామస్తులు కోరారు. రోడ్డుకిరువైపులా ముళ్ల పొదలు ఏపుగా పెరగడంతో వాహనదారులకు ప్రమాదాల బారిన పడుతారన్నారు. ముళ్ల పొదలు తొలగించాలని గ్రామస్తులు నాగేశ్వరరావు, విష్ణురెడ్డి, తదితరులు ఎంపీడీవోకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు.

పత్తికొండలో రోడ్డు వెడల్పు చేపట్టాలి


రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

పత్తికొండటౌన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్ కేంద్రమైన పత్తికొండలో ట్రాఫిక్ సమస్య నుంచి విముక్తి కలిగించాలంటే తక్షణమే పత్తికొండలో రోడ్డు వెడల్పు చేపట్టాలని ఆటో వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు వెంకటేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఈశ్వర్‌రెడ్డి భవన్ నుంచి సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ అధికారి ప్రసాద్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రవిచంద్ర, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు మోహన్, గిడ్డయ్య, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

విష జ్వరాలు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

వెల్దుర్తి టౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు విష జ్వరాలు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా సంచార నోడల్ అధికారి డా.రఘు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గోవర్ధనగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కొట్బాల గ్రామంలో జరుగుతున్న ఫ్రైడే - డ్రైడే కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు పలు సూచనలు చేశారు. ప్రతి ఇంటి వద్ద దోమల లార్వాలు కనిపించకుండా ప్రజలను భాగస్వాములు పెంచాలని ఆశా కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో వైద్యులు డా.నవీన్ కుమార్, సామాజిక ఆరోగ్య అధికారి పుష్ప, పాల్గొన్నారు.


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న నోడల్ అధికారి రఘు

ఈ నీరు తాగేదెలా..?

- గ్రామాలకు కలుషిత నీరు సరఫరా
- శుద్ధి చేయని ఫిల్టర్ బెడ్స్
- పట్టించుకోని కాంట్రాక్టర్లు
- పర్యవేక్షించని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు


బాపురం ఫిల్టర్ బెడ్స్

హాలహర్వి, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని విరుపాపురం, చింతకుంట, బాపురం మూడు గ్రామాల్లో తాగునీటి పథకాలు ఉన్నాయి. ఈ తాగునీటి పథకాల ద్వారా హాలహర్వి, చిప్పగిరి, ఆలూరు, హొళగుంద మండలాలకు తాగునీరు అందించాల్సి ఉంది. కానీ వీటి నిర్వహణ బాధ్యత అంతా కాంట్రాక్టర్లకు అప్పజెప్పడం వల్ల గ్రామాలకు తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది. పర్యవేక్షించాల్సిన అధికారులు పథకాలవైపు కన్నెత్తి చూడడం లేదు. దీంతో కలుషితనీరు తాగి జనం రోగాల పాలవుతున్నారు. ఫిల్టర్ బెడ్స్‌లో శుద్ధి చేయకుండా నీటిని నేరుగా పల్లెలకు వదలుతున్నారని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ నీరు తాగడం వల్లనే ప్రజలు అనేక రోగాలు బారిన పడుతున్నారని వైద్యులు చెబుతున్నారు.

కాలం చెల్లిన ఫిల్టర్ బెడ్‌లు

గత ప్రభుత్వం ఫిల్టర్ బెడ్స్ పట్ల నిర్లక్ష్యం వహించింది. దీంతో ఫిల్టర్‌బెడ్లు కాలం చెల్లిపోయింది. నీటితొట్టిలో ఇసుక కనిపించడం లేదు. మరమ్మతుల కోసం కొత్త ప్రభుత్వానికి రూ.40 లక్షలతో ప్రతిపాదనలు పంపించారు. ఈ ప్రభుత్వం సైతం తాగునీటి పథకాల పట్ల అలసత్వం వహిస్తోంది.

చర్యలు తీసుకుంటాం

కలుషితనీరు రాకుండా శుద్ధి చేసిన నీటిని వదిలేందుకు చర్యలు తీసుకుంటాం. అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారకుండా తాగునీటిని సమీపంలో భద్రత ఉండేలా చూస్తాం. తాగునీటి పథకం పరిధిలో మద్యం సేవించే వారిపై కేసులు నమోదు చేసేలా చూస్తాం. ఫిల్టర్‌బెడ్స్ మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపాం. నిధులు వస్తే పనులు చేపడతాం.

\- రామ్‌లీలా, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్

● ఈ చిత్రంలో కనిపిస్తున్న ఫిల్టర్ బెడ్స్ బాపురం తాగునీటి పథకానికి చెందిన ఫిల్టర్ బెడ్ ఇది. ఈ పథకం నుంచి 26 గ్రామాలకు తాగునీరు అందించే తాగునీటి పథకం. కానీ ఇక్కడ ఫిల్టర్‌బెడ్స్ పూర్తిగా కాలం చెల్లిపోయాయి. నూతన ఇసుకతో ఫిల్టర్‌బెడ్స్‌ను మరమ్మతులు చేసి శుద్ధి చేసిన తాగునీటిని గ్రామాలకు వదలాల్సి ఉంది. కానీ అధికారులు పట్టించుకోకపోవడంతో ఇక్కడ అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది.



ఘనంగా ఆదినారాయణరెడ్డి వర్ధంతి

పత్తికొండ టౌన్, జూలై18(ఆంధ్రజ్యోతి): స్థానిక సి.ఆర్.భవన్‌లో కామ్రేడ్ వి.కె.ఆదినారాయణరెడ్డి 28వ వర్ధంతి శుక్రవారం సీపీఐ నాయకులు ఘనంగా నిర్వహించారు. సీపీఐ ఉమ్మడి జిల్లా మాజీ కార్యదర్శి భీమలింగప్ప భీమలింగప్ప మాట్లాడుతూ రాయలసీమకు కృష్ణా జిల్లాలు మళ్లించాలని, విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో వి.కె.పోరాటం చేసిన ఫలితంగానే నేడు హంద్రీనీవా జలాలు సీమలో పారుతున్నాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నబిరసూల్, మండల కార్యదర్శి కారుమంచి, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, ప్రజా సంఘాల నాయకులు గురుదాస్, సురేంద్ర, సుల్తాన్, వీరన్న, కారన్న పాల్గొన్నారు.

హెల్ప్ డెస్క్ ఏర్పాటు

ఆదోని అగ్రికల్చర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ఆదోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ కోర్సుల ప్రవేశానికి హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన తన చాంబర్‌లో మాట్లాడుతూ ఇక్కడ పని చేసిన ప్రిన్సిపాల్ సింహాద్రి బదిలీ కావడంతో ఆళ్లగడ్డ నుంచి తను ప్రిన్సిపాల్‌గా బదిలీపై వచ్చానన్నారు. 2025-26 విద్యా సంవత్సరంలో డిగ్రీ మొదటి ఏడాది ప్రవేశాలకు ఆఫ్‌లైన్ ద్వారా నేరుగా కళాశాలలో ప్రవేశాలు జరుపుకోవడానికి అవకాశం ప్రభుత్వ కల్పించిందన్నారు. బీఏ(ఎకనామిక్స్), (హిస్టరీ), బీకాం (కంప్యూటర్ అప్లికేషన్), బీఎస్సీ(జువాలజీ), (బాటనీ)తోపాటు బీఎస్సీ(కంప్యూటర్ సైన్స్) కోర్సుల ప్రవేశానికి ఈనెల 21 నుంచి అడ్మిషన్లు జరుపుకుంటామన్నారు. ప్రభుత్వ నిర్దేశించిన తక్కువ ఫీజుతోనే ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు డిగ్రీలో చేరాలని సూచించారు. నేరుగా తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో రావాలన్నారు. వివరాలకు 9866041775, 6301008898 సంప్రదించవచ్చన్నారు.

వైసీపీలో బీసీలకు పెద్దపీఠ


బీసీ సెల్ జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన భాస్కర్‌ను, ఎమ్మెల్యే విరుపాక్షిని సన్మానిస్తున్న నాయకులు

ఆలూరు, జూలై18(ఆంధ్రజ్యోతి): వైసీపీలో బీసీలకు పెద్దపీఠ వేస్తుందని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో వైసీపీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శిగా నియామకమైన బోయ భాస్కర్‌నాయుడిని, ఎమ్మెల్యే విరుపాక్షిని నాయకులు సన్మానించారు.కార్యక్రమంలో మండల కన్వీనర్ మల్లికార్జున, తా లూకా క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు జాన్, ఆర్డీ జిల్లా ఉపాధ్యక్షులు కొట్బాల రాజు, ఆలూరు మండల రైతు విభాగం అధ్యక్షులు వెంకటేష్, మండల బూత్ కమిటీ అధ్యక్షులు రవి కుమార్, మండల విద్యార్థి విభాగ అధ్యక్షులు విజయ్‌కృష్ణ (సాయి), నాయకులు వీరేష్, నాగేం ద్ర, బాషా పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

వెల్దుర్తి, జూలై 18(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతు, సబ్‌స్టేసన్ నిర్వహణలో భాగంగా శనివారం వెల్దుర్తి, రామళ్లకోట, కలగొట్ల, గోవర్ధనగిరి, చెర్లకొత్తూరు సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శేషాద్రి శుక్రవారం పేర్కొన్నా రు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అంతరాయం ఉంటుందన్నారు. అలాగే వ్యవసాయ విద్యుత్ అన్ని ఫీడర్లు తెల్లవారుజాము 5 నుంచి ఉదయం 9 గంటల వరకు, మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు వ్యవసాయ విద్యుత్ రైతులకు అందుబాటులో ఉంటుందని వెల్లడించారు.

వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కురువలకు ప్రాధాన్యమివ్వాలి


మాట్లాడుతున్న మల్లికార్జున

ఆదోని అగ్రికల్చర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కురువలకు ప్రాధాన్యత కల్పించాలని కురువ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున అన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తమ ప్రాంతానికి చెందిన మాన్వి దేవేంద్రప్ప కురువ కార్పొరేషన్ చైర్మన్, బస్తిపాటి నాగరాజుకు ఎంపీగా అవకాశం కల్పించడం పట్ల రుణపడి ఉంటామన్నారు. కురువలంతా ఐక్యతతో ముందుకు సాగి ఆర్థికంగా రాజకీయంగా అభివృద్ధి చెందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు హనుమంతు, చిన్నపెండేకల్లు హనుమ రెడ్డి, బసవరాజు, శివ, రవి, పరమేష్ పాల్గొన్నారు.

మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవి కేటాయింపుపై హర్షం


మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడుని సన్మానిస్తున్న స్వకుల సాలే సామాజిక వర్గం నాయకులు

ఆదోని అగ్రికల్చర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : స్వకుల సాలె సామాజిక వర్గానికి చెందిన జిందే శారద బాయి శంకర్‌ను ఆదోని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కేటాయించడం పట్ల ఆ సంఘం నాయకులు కామలే వెంకోబా, రఘు, పొందే లక్ష్మణ్, జిందేశంకర్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడుని, సీనియర్ టీడీపీ నాయకుడు ఉమాపతి నాయుడు, చైర్మన్‌గా ఎంపికైన శారదాబాయి శంకర్‌లను గజమాలతో సన్మానించారు. మీనాక్షి నాయుడు కుటుంబానికి రుణపడి ఉంటామని, మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేస్తామని శారదాబాయి తెలిపారు. కార్యక్రమంలో జిందగీ గిడ్డి శంకర్, యువరాజు, నాగరాజుల, మహేశ్వరి, గీతాబాయి, నాగవేణి పాల్గొన్నారు.

బస్సు కోసం విద్యార్థినులు ఆందోళన


పోలీస్ స్టేషన్ వద్ద బస్సు కోసం వేచి ఉన్న విద్యార్థులు

ఆదోని అగ్రికల్చర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): బీసీ బాలికల హాస్టల్ బాలికలు పాఠశాల నుంచి హాస్టల్ వరకు బస్సు ఏర్పాటు చేయాలని ఆందోళన చేపట్టారు. శుక్రవారం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల నుంచి మేదారిగేరిలో ఉన్న బీసీ హాస్టల్ వరకు వెళ్లాలంటే ప్రధాన రహదారి గుండా ట్రాఫిక్ వల్ల ఇబ్బందులు గురవుతున్నామన్నారు. దాదాపుగా రెండున్నర కిలోమీటర్లు ప్రతిరోజు నడుచుకుంటూ స్కూల్ వెళ్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి సంఘ నాయకులు పీడీఎస్‌వో, డీఎస్ఎఫ్, బీడీఎస్ నాయకులు తిరుమలేష్, పగడాల రమేష్, ఉదయ్ విద్యార్థులకు మద్దతుగా రెండవ పోలీస్ స్టేషన్ వద్ద నడుచుకుంటూ వెళ్తున్న విద్యార్థులను అక్కడే కూర్చోబెట్టి ఆందోళన చేపట్టారు.

ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం: ఎమ్మెల్యే


మద్దికెరలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

మద్దికెర, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమ పాలన అందిస్తుందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తప్పక అమలు చేస్తారనీ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆయా వీధుల్లో సుపరిపాలనతో తొలి అడుగు ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు.

● సీనియర్ టీడీపీ నాయకులు కాకన్న చంద్రశేఖర్ చౌదరి గత కొద్ది రోజులుగా ఆరోగ్యం సరిగ్గా లేకపోవడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు పరామర్శించారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ కార్యదర్శి గూడూరు ధనుంజయుడు, మాజీ జడ్పీటీసీ సభ్యులు రాజన్న యాదవ్, పురుషోత్తంచౌదరి, తాలుకా తెలుగు యువత అధ్యక్షులు ఈడిగ చంద్రశేఖర్ గౌడు, మండల టీడీపీ అధ్యక్షులు ఎన్.లక్ష్మీనారాయణ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


పగిడిరాయిలో అవగాహన కల్పిస్తున్న టీడీపీ సీనియర్ నాయకులు తుగ్గలి నాగేంద్ర

ఆదోని: ప్రభుత్వ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకుందామని ఏపీ కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, టీడీపీ సీనియర్ నేత ఉమాపతినాయుడు అన్నారు. గురువారం స్థానిక 20వ వార్డులోని సాయిబాబానగర్‌లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు.

పత్తికొండ: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. శుక్రవారం పట్టణంలోని కటికెవీధిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మహేశ్, ఉలిగప్ప, రాజు ఉన్నారు.

తుగ్గలి: గ్రామాల్లో నెలకొన్న సమస్యలన్నీ పరిష్కరించి అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షుడు మనోహర్ చౌదరి అన్నారు. శుక్రవారం పగిడిరాయి గ్రామంలో సుపరిపాలన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఈశ్వర్ రెడ్డి, శివరాముడు చౌదరి, దామోదర్, చక్రపాణి, బాలబాషా, డీలర్ సుంకన్న, తిరుపాల్ నాయుడు, రాము, మహేశ్వరరెడ్డి ఉన్నారు.

చిప్పగిరి: చిప్పగిరి మండలం బంటనహాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు మీనాక్షి నాయుడు, చంద్రశేఖర్, రామచంద్ర, జనార్ధన్ గౌడ్, మాజీ సర్పంచ్ మార్తాండయ్య, రామాంజనేయులు పాల్గొన్నారు.

ఆలూరు: ఎన్నికల్లో ఇచ్చిన ప్రతిఒక్క హామీని కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందని ఆలూరు టీడీపీ మహిళా నాయకురాలు వైకుంఠం జ్యోతి అన్నారు. శుక్రవారం హత్తిబెలగల్ గ్రామంలో సుపరిపాలనకు తొలి అడుగు నిర్వమించారు.

పూడిక తొలగింపు చేపట్టాలి

ఆదోని టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కొత్త బస్టాండ్ ప్రాంతం నుండి డీఎస్పీ బంగ్లా మీదుగా వెళ్లన్న పెద్ద కాలువలో వెంటనే పూడిక తొలగింపు పనులను చేపట్టాలని మాజీ టీడీపీ కౌన్సిలర్, మండగిరి టీడీపీ ఇన్‌చార్జి శ్రీనివాస ఆచారి కొత్తగా వచ్చిన మునిసిపల్ ఎంఈ సత్యనారాయణను శుక్రవారం కలిసి కోరారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న కారణంగా పెద్ద వర్షం పడితే వంకపొంగి, పక్కనున్న దివాకర్ నగర్, శివశంకర్ నగర్ ప్రాంతాల్లో ఇళ్లు ముప్పుకు గురవుతాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మునిసిపల్ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

పచ్చదనం పెంపు అందరి బాధ్యత

ఆదోని టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : పచ్చదనం పెంపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గ్రీనరీ డెవలప్‌మెంట్ అసోసియేషన్ చైర్మన్ లలితమ్మ వైస్ చైర్మన్ డా.వినీత అన్నారు. అమరావతి నగర్‌లోని హైస్కూల్ ప్రాంతంలో కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు శివజ్యోతి, బీజేపీ సౌత్ జోన్ మహబూబ్ బాష, పరుశురాం పాల్గొన్నారు.

కూటమితో అన్ని వర్గాల అభివృద్ధి

తుగ్గలి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు, నాయకులు అభివృద్ధి చెందుతున్నారని జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ బత్తిన వెంకట్రాముడు, ఎస్సీ, ఎస్టీ సెల్ ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీరాములు అన్నారు. శుక్రవారం చెన్నంపల్లిలో నూతనంగా పత్తికొండ మార్కెట్ యార్డు డైరెక్టర్‌గా ఎంపికైన మైనార్టీ సెల్ నాయకులు మాబాషాను జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ బత్తిన వెంకట్రాముడులను ఎస్సీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు శ్రీరాములు శాలువ కప్పి, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కోకన్వీనర్ వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు అక్బర్, కోటేష్‌గౌడు, రామయ్య, రాజు, తదితరులు ఉన్నారు.

గత వైసీపీ పాలనలో నిద్రపోయావా?


ఆస్పరిలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ఆస్పరి, జూలై18(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ఐదేళ్ల పాలనలో ఆస్పరి మండలంలో తాగునీటి సమస్య పట్టించుకోలేదని, ఆ రోజుల్లో నిద్రపోయావా అని ఆలూరు వైసీపీ ఎమ్మెల్యే విరుపాక్షిని మండల టీడీపీ నాయకులు ప్రశ్నించారు. శుక్రవారం ఆస్పరి గాంధీ పార్కులో మండల టీడీపీ నాయకులు, మాజీ ఎంపీపీ వెంకటేష్, మాజీ మార్కెట్ డైరెక్టర్ సంజన, తెలుగు యువత నాయకుడు రాఘవేంద్రయాదవ్, ఆస్పరి తాగునీటి సమస్యపై రాస్తారోకో చేసిన ఎమ్మెల్యే విరుపాక్షిపై తీవ్ర విమర్శలు చేశారు. సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు వైసీపీ పార్టీలో గెలిచినా ఏనాడైనా జడ్పీ, మండల పరిషత్ సమావేశాల్లో తాగునీటి సమస్య గురించి మాట్లాడారా అని విమర్శించారు. ఐదేళ్లలో ఒక్కటైనా శాశ్వతంగా గుర్తిండిపోయే పని చేశారా అని ప్రశ్నించారు. యువగళం పాదయాత్రలో మండలంలో నెలకొన్న తాగునీటి సమస్యను పార్టీ యువ నాయకుడు నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు వీరేష్, శీనప్ప, మల్లికార్జున, సుదర్శన్, కరుణాకర్, రాందాస్ పాల్గొన్నారు.

రైతుసేవా కేంద్రాల్లో యూరియా

పత్తికొండ టౌన్, జూలై18(ఆంధ్రజ్యోతి): పత్తికొండ మండలానికి 200 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని, రైతుసేవా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వెంకటరాముడు తెలిపారు. శుక్రవారం మండలంలోని చిన్నహుల్తి గ్రామంలో సబ్సిడీ యూరియా ఎరువులను వ్యవసాయ అధికారులు రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెద్దహుల్తి టీడీపీ నాయకులు మాణిక్యరెడ్డి, తిప్పన్న, రంగన్న, లోకనాయుడు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ ఆర్థిక సాయం

ఆదోని రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ఆదోని మండలం పెద్దతుంబళం గ్రామానికి చెందిన ఈరమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న కాంట్రాక్టర్ బసవరాజు మృతురాలి కుటుంబ సభ్యులకు రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

ఆలూరు, జూలై18(ఆంధ్రజ్యోతి): ఆలూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి రెండో విడత ఐటీఐలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం దరఖాస్తు గడువును ఈనెల 20వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ సూర్యశేఖర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. పది పాస్, ఫెయిల్ అయిన విద్యార్థులు ఐటీఐ డాట్ ఏపీ డాట్ జీఓవీ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లను ఆలూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో వెరిఫికేషన్ చేసుకోవాలన్నారు. వెరిఫికేషన్ చేసుకున్న వారు ఈ నెల 24వ తేదీన ఉదయం 9 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఎలాంటి కాల్ లెటర్‌లు రావన్నారు.

సొసైటీ అభ్యున్నతికి కృషి చేయాలి


నూతన ప్రెసిడెంట్‌ను సన్మానిస్తున్న దృశ్యం

పత్తికొండ టౌన్, జూలై 18(ఆంధ్ర జ్యోతి): పత్తికొండ సొసైటీ అభ్యున్నతికి నూతన పాలకమండలి పని చేయాలని సీపీఐ దూదేకొండ గ్రామ ఎంపీటీసీ వీరన్న, వాల్మీకి సంఘం నాయకులు భగవాన్‌లు కోరారు. ఇటీవల పత్తికొండ సహకార పరతిసంఘం నూతన ప్రెసిడెంట్‌గా ఎన్నుకోబడిన చందోలి రంగప్పను వారు శాలువా, పూలమాలతో సత్కరించి సన్మానించారు.

విధులకు డుమ్మా కొడితే చర్యలు

హాలహర్వి, జూలై18(ఆంధ్రజ్యోతి): సచివాలయంలో సిబ్బంది విధులకు డుమ్మా కొడితే చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో వరలక్ష్మి అన్నారు. శుక్రవారం బాపురం సచివాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. సచివాలయంలో సిబ్బంది ఎవరూ లేకపోవడంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిపై చర్యలు తీసుకోవాలని కార్యదర్శి అజీజ్‌అహ్మద్‌ను ఆదేశించారు. వెంటనే వారికి మెమోలు జారీ చేసి చర్యలు తీసుకునేలా కలెక్టర్‌కు పంపాలన్నారు.

సచివాలయం ముందు రైల్వే సామగ్రి

ఆదోని రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ఆదోని మండలం గణేకల్లు సచివాలయం వద్ద రైల్వే సామగ్రి వేయడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సచివాలయానికి నిరంతరం అధికారులు, ప్రజలు వస్తుంటారు. సామగ్రితో రాకపోకలకు అంతరాయం కలిగింది. తక్షణమే రైల్వే సామగ్రిని తొలగించాలని సీపీఎం నాయకులు వీరారెడ్డి, లింగన్నలు కోరారు.



గణేకల్లు సచివాలయం వద్ద వేసిన రైల్వే సామగ్రి

జగన్‌పై ఆ.. అధికారులకు తగ్గని ప్రేమ..



పెద్దకడుబూరులోని సచివాలయం-1 పై తొలగించని జగన్ నవరత్నాల చిత్రం

పెద్దకడుబూరు, జూలై 18: రాష్ట్రంలో ప్రభుత్వం మారి ఏడాది దాటినా సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలపై ఇప్పటికీ గత ప్రభుత్వ ఆనవాళ్లే దర్శనమిస్తున్నాయి. మండల కేంద్రమైన పెద్దకడుబూరు, మండల పరిధిలోని హనుమాపురం గ్రామంలోని సచివాలయం, రైతు భరోసా కేంద్రాల్లో పనిచేస్తున్న అధికారులు వైసీపీ ప్రభుత్వమే ఇంకా అధికారంలో ఉందన్న భ్రమలో ఉన్నారు.. ఇందుకు నిదర్శనమే ఆయా కేంద్రాలపై జగన్ ఫొటోతో ఉన్న నవరత్నాల చిత్రాల లోగోలు కనిపిస్తున్నాయి. ఎక్కడో మారుమూల ప్రాంతంలో ఈ విధంగా ఉంటే ఎవరు పట్టించుకోరు. కానీ మండల కేంద్రంలో, అది కూడా ఎంపీడీవో కార్యాలయానికి ఎదురుగా ఉన్న సచివాలయ కేంద్రంలోని కనిపిస్తుండడంతో అధికారుల నిర్లక్ష్య వైఖరి స్పష్టం అవుతోంది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి గత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చిత్రాలతో కూడిన లోగోలను తొలగించేలా చర్యలు చేపట్టాలని నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు.

ఎల్లెల్సీకి నీటి విడుదల


నందవరంలో నీటిని విడుదల చేస్తున్న టీడీపీ నాయకులు

నందవరం, జూలై 18(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చిన్న కొత్తిలి డిస్ట్రిబ్యూటరీ కింద రైతులకు సాగు నీటిని ఛైర్మన్ హాలహర్వి గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా కెనాల్ దగ్గర ఎల్లెల్సీ వర్క్ ఇన్స్‌పెక్టర్ సుధాకర్‌యాదవ్, టీడీపీ మండల కన్వీనర్ కాశీంవలీ, సహకార సంఘం మండల అధ్యక్షుడు ధర్మాపురం గోపాల్, మార్కెట్‌యార్డు డైరెక్టర్ నాగలదిన్నె సుధీర్, ఎల్లెల్సీ డైరెక్టర్ నందవరం వీరేష్, జగ్గాపురం నరసింహులు రైతుల కోసం సాగునీటి విడుదల చేశారు. రైతుల జీవనాడి ఆర్డీఎస్‌ను ప్రతిపాదించి పశ్చిమ ప్రాంత ప్రజలకు, తాగు, సాగునీరు ఇబ్బంది లేకుండా చూడాలన్నదే ఎమ్మెల్యే ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడి లక్ష్యం అన్నారు. ఇందుకు సీఎం చంద్రబాబును ఒప్పించారన్నారు. ఈ ప్రాంత రైతులు ఎమ్మెల్యేకు రుణపడి ఉంటారని తెలిపారు.

నదిలో దూకి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

● కాపాడిన ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం

మంత్రాలయం, జూలై 18(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం వద్ద తుంగభద్ర నదిలో దూకి ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తిని ఎస్‌డీఆర్ఎఫ్ బృందం సభ్యులు ప్రాణాలు తెగించి కాపాడారు. ఈ ఘటన శుక్రవారం ఉదయం జరిగింది. మంత్రాలయం ఎస్ఐ శివాంజల్, ఎస్‌డీఆర్ఎఫ్ ఎస్ఐ మహేంద్ర నాయక్ తెలిపిన వివరాలివీ.. తుంగభద్ర నది ఉధృతంగా ప్రవహిస్తుండగా.. అక్కడే గస్తీలో ఉన్న ఎస్‌డీఆర్‌ఎఫ్ రెస్క్యూ బృందం మనోహర్ గమనించి లైఫ్ జాకెట్‌తో వరదలో కొట్టుకుపోతున్న మంత్రాలయం మండలంలోని మాధవరం చెందిన రచ్చుమర్రి గోపురప్ప అనే వ్యక్తిని అతికష్టం మీద ఒడ్డుకు చేర్చారు. అప్పటికే మద్యం తాగి నదిలో దూకాడు. వరద ఉధృతికి చాలా వరకు దూరం వరదలో మునిగుతూ తేలుతూండగా.. వెంటనే స్పందించిన ఎస్‌డీఆర్ఎఫ్ బృందం నదిలో దిగి గోపురప్పను ఒడ్డున చేర్చి ప్రాణాలతో కపాడి సురక్షితంగా మంత్రాలయం పోలీసులకు అప్పగించారు. వెంటనే ఎమ్మిగనూరు ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. ఆసుపత్రిలో బాధితుడు కోలుకుంటున్నారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

చిరుద్యోగి అదృశ్యం


బజారప్ప

ఎమ్మిగనూరు టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో చాకలి వీధిలో నివసిస్తున్న చిరుద్యోగి చాకలి బజారప్ప (50) గత 8రోజులుగా అదృశ్యం అయినట్లు పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు తెర్నెకల్ బీసీ హాస్టల్‌లో వంట మనిషిగా పని చేస్తున్న ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన చాకలి బజారప్ప 8 రోజులుగా కనిపించడం లేదని పట్టణ పోలీసు స్టేషన్‌లో భార్య నాగమ్మ ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

మహాసభలను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): కర్నూలు పట్టణంలో ఆగస్టు 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు జరిగే 24వ సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా నాయకుడు పంపన్నగౌడ్ కోరారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయం ముందు జిల్లామహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక, కర్షక, రైతాంగ సమస్యల పరిష్కారం కోసం సీపీఐ ఆవిర్భవించిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం చేపట్టే ఈ మహాసభలను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు రంగన్న, ఇతరులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టించాలి

నందవరం, జూలై 18(ఆంధ్రజ్యోతి): చెత్త కేంద్రాల నుంచి సంపద సృష్టించాలని జిల్లా పరిషత్ సీఈవో నారపరెడ్డి తెలిపారు. శుక్రవారం నందవరంలోని పెద్దకొత్తిలి గ్రామంలో చెత్త కేంద్రాలను పరిశించారు. అనంతరం పొడి, తడి చెత్తలను వేరు చేసి వాటి నుంచి సంపదను సృష్టించాలని వాటి ద్వారా విద్యుత్‌తో పాటు అన్ని రకాల వినియోగాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. గ్రామంలో పర్యటించి సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని గ్రామాల్లో అధికంగా ఉన్నాయని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో పుల్లయ్య, డిప్యూటీ ఎంపీడీవో సందీప్, పీఆర్ ఏఈ నరసింహులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బాలకృష్ణ, ఏవో కృష్ణమూర్తి పాల్గొన్నారు.

కనిపించని కంప్యూటర్ విద్య

● కంప్యూటర్‌కు దూరమవుతున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు
● 2019 నుంచి పాఠశాలల్లో అందుబాటులో లేని కంప్యూటర్లు

ఎమ్మిగనూరు రూరల్, జూలై 18: ప్రస్తుత కాలంలో ఏరంగంలో పనిచేయాలన్నా కంప్యూటర్ అవగాహన తప్పనిసరిగా మారింది. చదువుకునే రోజుల మొదలుకొని ఉద్యోగం చేసే సమయం వరకు కంప్యూటర్ వినియోగం తప్పడంలేదు. పాఠశాల విద్య నుంచే విద్యార్థులకు కంప్యూటర్‌పై అవగాహన కల్పించేందుకు 2014 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం ప్రతి పాఠశాలలో ఓ కంప్యూటర్ ఉపాధ్యాయుడిని నియమించి విద్యార్థులకు కంప్యూటర్ విద్యను నేర్పేవారు. ఆ సమయంలో ఎంతో మంది పేద విద్యార్థులు కంప్యూటర్‌ను నేర్చుకొని ఉద్యోగాలు సైతం సంపాదించారు.

పాఠశాలల్లో నిలిచిన కంప్యూటర్ విద్య: 2019 సంవత్సరం నుంచి పాఠశాలల్లో కంప్యూటర్ విద్యను నిలిపివేశారు. దీంతో విద్యార్థులు కంప్యూటర్ విద్యను నేర్చుకునేందుకు ప్రైవేటు కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్‌లను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇందుకోసం విద్యార్థులు కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్‌లకు అధిక మొత్తంలో డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ఎంతో మంది విద్యార్థులు డబ్బులు వెచ్చించలేక కంప్యూటర్ విద్యకు దూరమయ్యారు. ఎమ్మిగనూరు మండలంలో 20



ఉన్నత పాఠశాలలు, 75 ఆదర్శప్రాథమిక పాఠశాలలు, 8బేసిక్ ప్రైమరీ పాఠశాలలు, 5 ఫౌండేషనల్ పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో మొత్తం దాదాపు 21,784 మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరందరికి పాఠశాల విద్య నుంచే కంప్యూటర్ విద్యనుఅందుబాటులోకి తెస్తే ఎంతో మంది పేద విద్యార్థులు కంప్యూటర్‌పై అవగాహన పెంచుకొని చదువు పూర్తయిన అనంతరం ఉద్యోగాలు పొందే అవకాశం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

2019 నుంచి నిలిచిపోయింది



2014లో ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ విద్య విద్యార్థులకు అందుబాటులో ఉండేది. 2019 నుంచి పాఠశాలల్లో కంప్యూటర్ విద్యను నిలిపివేశారు. ప్రభుత్వం విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అందుబాటులోకి తీసుకువస్తే ఎంతో మంది విద్యార్థులు కంప్యూటర్ ను ప్రభుత్వ పాఠశాలల్లో నేర్చుకునే అవకాశం ఉంది.

● మధుసూదన్, ఎంఈవో-2, ఎమ్మిగనూరు

కంప్యూటర్ అందుబాటులోకి తీసుకురావాలి



పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అందుబాటులోకి తీసుకువస్తే ఎంతో బాగుంటుంది. మాలాంటి పేద విద్యార్థులు ప్రైవేటు కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్‌లకు వెళ్లి కంప్యూటర్ విద్యను నేర్చుకోలేకపోతున్నాం. పాఠశాలలోనే కంప్యూటర్ విద్య ఉంటే సులభంగా కంప్యూటర్‌నే నేర్చుకోగలము.

● శాంతి, 10వ తరగతి విద్యార్థిని, గుడికల్లు గ్రామం

ఎంతో అవసరం



10వ తరగతి పూర్తయిన తర్వాత ఉన్నత చదువులు చదవాలంటే కంప్యూటర్ విద్య ఎంతో అవసరం అవుతుంది. పాఠశాల విద్య నుంచే ప్రభుత్వ కంప్యూటర్ విద్యను అమలు చేస్తే ఎంతో మంది విద్యార్థులు కంప్యూటర్‌ను నేర్చుకోగలరు. ప్రభుత్వం స్పందించి పాఠశాలల్లో కంప్యూటర్ విద్యను అమలు చేయాలని కోరుతున్నాను.

● శివనాగ చైతన్య, 10వ తరగతి విద్యార్థి, గుడికల్లు గ్రామం

భవిష్యత్తుకు కంప్యూటర్ విద్య..



ప్రస్తుత కాలంలో విద్యార్థుల భవిష్యత్తుకు కంప్యూటర్ విద్య ఎంతో అవసరంగా మారింది. కంప్యూటర్ విద్యపై అవగాహన లేనిదే ఉద్యోగాలు చేయలేని పరిస్థితి. ఏ రంగంలో చూసిని తప్పకుండ కంప్యూటర్ అవసరంగా మారింది. దీంతో విద్యార్థులు పాఠశాల విద్యను అభ్యసించే సమయం నుంచే కంప్యూటర్ విద్యను నేర్చుకోవాలి.

● నరసప్ప, ప్రధానోపాధ్యాయుడు, గుడికల్లు గ్రామం

చెరువు కుంటలా పాఠశాల మైదానం


దొడ్డి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ముందు నిల్వ ఉన్న వర్షపు నీరు

కోసిగి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): చిన్న పాటి వర్షానికే పాఠశాలల మైదానాలు చెరువు కుంటల్లా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వివరాల్లోకి వెళితే కోసిగి మండల పరిధిలోని దొడ్డి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ముందు రోడ్డుపై చెరువుకుంటలా వర్షం నీరు నిల్వ చేరడంతో విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ఆ రోడ్డు గుండా చిన్నభోంపల్లి, పెద్దభోంపల్లి గ్రామాలకు వెళ్లే వాహనాదారులు ప్రజలకు కూడా ఇబ్బందులు తప్పడం లేదు. పాఠశాలలకు వెళ్లే చిన్నారులు నీటి కుంటల్లో పడిపోయే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వర్షం నీరు బయటకు వెళ్లకుండా పాఠశాల ముందు మడుగులా చేరడంతో సమస్య పరిష్కరించాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

బకాయిలు చెల్లించాలి



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి అనీఫ్

ఎమ్మిగనూరు టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో కూలీలకు పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి కే అనీఫ్, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఏసేపు డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని అన్నారు.. స్మార్ట్ మీటర్లను బిగించడం వంటివి ఆపాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో మధు, షఫీ, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

పులికనుమ ప్రాజెక్టుకు నీరు లిఫ్టింగ్

కోసిగి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సాతనూరు, అగసనూరు సమీపంలో ఉన్న తుంగభద్ర నదికి వరద నీరు, తుంగభద్ర డ్యాం గేట్లు ఎత్తడంతో తుంగభద్రకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. బుధవారం మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి పులికనుమ పంప్‌హౌస్‌ను ప్రారంభించడంతో కోసిగి సమీపంలో ఉన్న పులికనుమ ప్రాజెక్టులోకి రెండు మోటార్ల ద్వారా నీరు లిఫ్ట్ అవుతుండటంతో ఇప్పుడిప్పుడు ప్రాజెక్టులోకి నీరు చేరుతుంది. మూడు రోజుల నుంచి ప్రాజెక్టులోకి నీరు వచ్చి చేరుతుండటంతో రోజురోజుకు పెరుగుతూ వస్తుంది. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కార్మికుల హక్కుల కోసం రాష్ట్రవ్యాప్త సమ్మె

ఎమ్మిగనూరు టౌన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల సాధన కోసం జూలై 21 నుంచి రాష్ట్రవ్యాప్త సమ్మెకు సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు ఇస్మాయిల్ పిలుపునిచ్చారు. ఎమ్మిగనూరు మునిసిపాలిటీలో జూలై 21వ తేదీ నుంచి సమ్మె బాట పడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం రాష్ట్ర నాయకత్వాన్ని చర్చలకు పిలిచి న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు.

ప్రహ్లాదరాయల వెండి రథోత్సవం


వెండి రథంపై విహరిస్తున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, జూలై 18(ఆంధ్రజ్యోతి): శ్రీమఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు వెండి రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. శుక్రవారం అష్టమి శుభదినాన్ని పురస్కరించుకుని శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆశీస్సులతో అర్చకులు బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బృందావనాన్ని బంగారు, వెండి, పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం ఊంజల మంటపంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలను అధిష్ఠించి ఊంజలసేవ నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలి వచ్చిన భక్తులతో మంత్రాలయం సందడిగా మారింది.

మంచాలమ్మకు విశేష పంచామృతాభిషేకం: రాఘవేంద్ర స్వామి మఠంలో వెలసిన గ్రామదేవత మంచాలమ్మ దేవతకు విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. శుక్రవారం ఆషాఢమాస అష్టమి శుభదినం ను పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆశీస్సులతో ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, కుంకుమ సేవ, సుగంధ ద్రవ్యాలతో విశేష పంచామృతాభిషేకం చేసి పసుపు, గంధం, పట్టుచీర, బంగారు, వెండి ఆభరణాలుతో పాటు వివిధ రకాల పుష్పాలతో శోభాయామానంగా అలంకరించారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

పెద్దకడుబూరు, జూలై 18: ఆగస్టు 9, 10, 11వ తేదీల్లో జరగబోయే కర్నూలు జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి భాస్కర్‌యాదవ్, మండల కార్యదర్శి వీరేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రమైన పెద్దకడుబూరులోని బస్టాండ్ ఆవరణలో కరపత్రాలను విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయాలని అన్నదాత సుఖీభవ కింద రైతులకు రూ.25వేలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కమ్మరి చంద్ర, ఆంజనేయులు, మల్లన్న, నాగప్ప, అమరేష్, బాషా, నాగన్న పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా

పెద్దకడుబూరు ,జూలై 18: రైతులకు అందుబాటలో యూరియా ఉందని ఎవరు ఆందోళన చేందాల్సిన అవసరం లేదని ఏవో సుచరిత అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన పెద్దకడబూరులో ఆమె మాట్లాడుతూ రైతులకు ఇప్పటికి వరకు 162 టన్నుల యూరియాను పంపిణీ చేశామన్నారు. రైతు సేవా కేంద్రాల్లో కూడా యూరియా అందుబాటలో ఉంటుందన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి

ఎమ్మిగనూరు టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సామాజిక సంక్షేమాభివృద్ధికై టీడీపీ కృషి చేస్తోందని డీఈఎఫ్ నాయకులు అన్నారు. ఈ సందర్భంగా వారు కర్నూలులో జూలై 22వ తేదీన జరగబోయే దివ్యాంగుల సాధికారత ఫోరం ఆవిర్భావ సభకు ఆహ్వాన పత్రిక ను టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డికి అందజేసి జరగబోయే సభకు సహాయ, సహకారాలు అందించాలని డీఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నాగరాజు, గౌరవ అధ్యక్షులు అల్ఫ్రెడ్ రాజులు తిక్కారెడ్డిని స్వగృహం నందు కోరారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు రూ. 6వేల పింఛను ఇచ్చిన చరిత్ర ఒక్క కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు. దివ్యాంగుల అభివృద్ధి, సామాజిక సంక్షేమాభివృద్ధికై కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నరసింహులు, రామకృష్ణ, చెన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ప్రభుత్వం అండ


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి

మంత్రాలయం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం బాగాలేకపోయి సొంత డబ్బులతో చికిత్సలు చేయించుకున్న బాధిత కుటుంబాలకు టీడీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మాధవరం తన నివాసంలో సీఎం సహాయ నిధి కింద మంత్రాలయం మండలంలోని చెట్నహళ్లి గ్రామానికి చెందిన తార్నాథ్, ఐశ్వర్య మూడేళ్ల కొడుకు సూర్య ఆదిత్యకు లివర్ అపరేషన్‌కు మంజూరైన రూ.8లక్షలు చెక్కును మంచాల సొసైటీ డైరెక్టర్ చాపల నాగేష్, మల్లేష్, వెంకటరాముడు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ సీనియర్ నాయకులు రాకేష్ రెడ్డి, నాగరాజు, రామయ్య, గురు, వంశీ, రామకృష్ణ, రాఘవేంద్ర, జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు ఉంటే చెప్పండి : నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తమదృష్టికి తెస్తే తీర్చేందుకు కృషి చేస్తామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. శుక్రవారం మాధవరం తన నివాసంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని ప్రజలు అర్జీలు ఇచ్చేందుకు క్యూ కట్టారు. అర్జీలను తీసుకుంటూ అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతూ కొన్ని సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో మంత్రాలయం మార్కెట్ యార్డు ఛైర్మన్ నర్సిరెడ్డి, బదెనేహాల్ సొసైటీ ఛైర్మన్ మారెప్ప, టీడీపీ నాయకులు శివ, దొడ్డయ్య, గుర్నాంటి భీమిరెడ్డి, పాల్గొన్నారు.

ఇది ప్రజలు మెచ్చిన ప్రభుత్వం


ప్రజలకు కరపత్రాన్ని అందిస్తున్న టీడీపీ నాయకులు

కోసిగి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో భాగంగా సూపర్ సిక్స్ హామీలన్నీ ప్రభుత్వం వచ్చిన ఏడాది పాలనలోనే 80 శాతం పూర్తి చేయడంతో కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు మెచ్చుకుంటున్నారని, ఇది ప్రజలు మెచ్చిన ప్రభుత్వం అని మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి తనయుడు, యువ నాయకుడు రాకేష్ రెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు ముత్తురెడ్డి అన్నారు. మండల పరిధిలోని చింతకుంట గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందించిన పథకాలను, అలాగే అందించే పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్లబండ సహకార సంఘం ఛైర్మన్ నాడిగేని అయ్యన్న, మాజీ జడ్పీటీసీ తోవి రామకృష్ణ, నాడిగేని తాయన్న, చింతలగేని నర్సారెడ్డి, రంగారెడ్డి, గౌస్, ఖలందర్, తదితరులు ఉన్నారు.

ఎమ్మిగనూరు రూరల్: ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి సహకారంతో కలుగొట్ల గ్రామాన్ని అభివృద్ధి చేసి చూపుతామని గ్రామ టీడీపీ అధ్యక్షులు కొండన్నగౌడ్, యూనిట్ ఇన్‌చార్జి నరసన్నగౌడ్‌లు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కలుగొట్ల గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రామలింగడు, విజయ్, మోహన్, తిమ్మప్ప, చంద్ర పాల్గొన్నారు.

పెద్దకడుబూరు: కూటమి ప్రభుత్వంతోనే అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని టీడీపి రాష్ట్ర యువ నాయకులు రామకృష్ణా రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నౌలేకల్ గ్రామంలోని సుపరిపాలనలో తొలి అడుగు - ఇంటింటికి టీడీపీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర రైతు సంఘం అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి, టీడీపి బసలదొడ్డి ఈరన్న, పెద్దకడబూరు సొసైటీ ఛైర్మన్ మీ సేవ ఆంజినేయులు, చిన్నతుంబళం సొసైటీ ఛైర్మన్ మీసేవ నరసప్ప పాల్గొన్నారు.

ఏసీ గోడౌన్ పరిశీలన

నందవరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నందవరం ఏసీ గోడౌన్‌ను జడ్పీ సీఈవో నాసరరెడ్డి, తహసీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీవో పుల్లయ్య, మండల సహకర సంఘం అధ్యక్షుడు ధర్మాపురం గోపాల్, మండల పార్టీ కన్వీనర్ కాశీంవలి శుక్రవారం పరిశీలించారు. కార్యక్రమంలో నాగలదిన్నె సుధీర్, ఆదిశేషు, నదికైరవాడి వీరేష్ పాల్గొన్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థి విరాళం

గోనెగండ్ల, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్దమరివీడు గ్రామంలోని ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి కాశీం రూ. 10వేల తో బీరువా కొని తాను చదివిన పాఠశాలకు విరాళంగా ఇచ్చారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలకు బీరువాను ఇవ్వడంతో పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ దూద్‌బాషా, పూర్వవిద్యార్థి రంగస్వామి, కాశీం మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి చెందితే గ్రామం కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతశిఖరాలకు చేరాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సనీతాబేగ్, ఉపాధ్యాయులు రామలింగం, పురుషోత్తం, గంగాధర్, నరసప్ప, లత గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ప్రాజెక్టులను సర్వనాశనం చేసిన వ్యక్తి జగన్

ఎమ్మిగనూరు జూలై18(ఆంధ్రజ్యోతి): రాయలసీమ బిడ్డను అని చెప్పుకొని సీమ ప్రాజెక్టులను 'జగన్ ఐదేళ్లలో సర్వనాశనం చేశాడని.. జగన్ రాయలసీమ బిడ్డకాదని.. రాయలసీమకు పట్టిన క్యాన్సర్ గడ్డ' అని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ ఛైర్మన్ చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ సీఎం జగన్‌పై తీవ్రంగా మండిపడ్డారు. రాయలసీమకు జగన్, వైసీపీ ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పేరుతో అవినీతికి పాల్పడి రూ. 782కోట్లు దండుకోవటం తప్ప మీరు ఏమి చేశారన్నారు. సాధ్యం కాదని తెలిసి కూడా 798 లెవల్ నుంచి నీటిని లిఫ్ట్ చేస్తామని చెప్పి రాయలసీమ ప్రజలను మోసం చేసింది మీరు కాదా అని ప్రశ్నించారు. పక్కరాష్ట్రం తెలంగాణలోని కాళేశ్వరం కొరకు రాయలసీమ ప్రజలను మోసం చేస్తు దొంగదీక్ష చేసి అక్కడి సీఎంతో కలిసి విందులు, సన్మానాలు చేసుకుంది మీరు కాదా అని అన్నారు. తెలంగాణ ప్రజలు అడ్డుకుంటున్నారని చెప్పి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌ను ఆపి ప్రజలను మోసం చేసింది మీరు కాదాఅని ప్రశ్నించారు. రాయలసీమకు నీరు ఇచ్చిన వ్యక్తి చంద్రబాబు అయితే రాయలసీమ లిఫ్టు పేరుతో రాయలసీమ ప్రజలకు నీరు ఇవ్వకుండా దొంగదీక్ష చేసిన వ్యక్తి జగన్ అని ఎవరు ప్రజలను మోసం చేశారో అర్థం చేసుకోవాలన్నారు.

యూరియా కొరతలేదు: ఎమ్మిగనూరు నియోజవకర్గంలో యూరియా సమృద్ధిగా ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైతులకు అవసరమైన యూరియాను అందుబాటులో పెట్టామన్నారు. ఎవరైన కృతిమ కొరతసృష్టిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు


వీరంపల్లిలో కరపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే బీవీ

ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అవసరమనుకుంటే మరింత యూరియాను తెప్పిస్తామన్నారు.

గోనెగండ: రాయలసీమ ప్రాంత ప్రజలకు, రైతులకు తాగు, సాగునీటి పుష్కలంగా అందించాలంటే ఒక్క టీడీపీతో సాధ్యం అని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వీరంపల్లి గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తిరుపతయ్య నాయుడు, మల్లయ్య, రమణ, రాంపురం రఫీక్, వీరంపల్లి స్వామి పాల్గొన్నారు.